సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | గురువారం 11 జూన్ 2026

సంపుటి: 17 | సంచిక: 164

పేజీలు: 08 | వెల: రూ.2:00

Published from Hyderabad, Vijayawada.

## పశ్చిమాసియాలో మళ్లీ మొదలైన యుద్ధం..

ఇరాన్ నిఘా స్థావరాలపై అమెరికా దాడులు.

గోరుక్, ఖేష్మ్ దీవులలో యూఎస్ డ్రోన్‌ల వర్షం

ఇజ్రాయెల్ పై ఇరాన్ ప్రతీకార దాడులు

బీరూట్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో ఎటాక్

గోరుక్,జూన్10(సాక్ష్యం): ఇరాన్ తీర ప్రాంతంలోని రాడార్ స్థావరాలపై దాడి చేసింది. అంతకుముందు హర్మ్యూజ్ వైపు ఇరాన్ ప్రయోగించిన డ్రోన్‌ను అమెరికా సైన్యం కూల్చివేసింది. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాంతో ఈ దేశాల మధ్య శాంతి

మిగతా 5 లో..





## 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం

ఐటిని వినియోగించుకోవాలన్న కమిషనర్

హైదరాబాద్,జూన్ 10 (సాక్ష్యం): ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి

మిగతా 2 లో..



## వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్ బోర్డు

హైదరాబాద్,జూన్10 (సాక్ష్యం): తెలంగాణలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ పక్రియ పూర్తయింది. తుది మెరిట్ లిస్ట్‌తో

మిగతా 2 లో..



## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు?

పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్,జూన్ 10 (సాక్ష్యం): మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు

మిగతా 2 లో..




# మార్పు చూపించాం..

- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్ల ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ,జూన్ 10 (సాక్ష్యం): కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు

మిగతా 2 లో..



## 2047 సంవత్సరం వరకూ మోదీయే దేశ ప్రధాని

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- చారిత్రక మైలురాయిని అధిగమించిన మోడీ
- భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక మోడీ
- ఎక్స్ వేదికగా రాంచంద్రారవు అభినందనలు

కరీంనగర్,జూన్10(సాక్ష్యం): భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

మిగతా 5 లో..

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

- నెహ్రూ రికార్డును తిరగరాసిన మోడీ
- సుపరిపాలన అతిపెద్ద పరీక్ష: మోడీ పోస్ట్
- ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి
- మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి
- మోడీకి వివిధ దేశాల నేతల అభినందనలు
- ఎక్స్ వేదికగా విషెస్ తెలిపిన మెలోనియా
- ఎన్డీయే భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు
- వివిధ రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీలు హాజరు

న్యూఢిల్లీ,జూన్10(సాక్ష్యం): నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా

మిగతా 2 లో..



# ప్రపంచానికే ఫ్యూచర్‌సిటీ

- ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు
- టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగిపోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కేసీఆర్
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

**ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సీఎం**



**బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములు విలువ ఎక్కువన్న సీఎం, కుతుబ్‌షాహీలు, నిజాంలు కృషి వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. హైటెక్‌సిటీ అంటే నవ్విన వాళ్లు ఉన్నారని, విమానాశ్రయం, జీనోమ్‌వ్యాలీ, ఐటీ సంస్థలను ఆనాడు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఐటీ పరిశ్రమలు రాకుంటే ఈనాడు యువతకు ఉద్యోగాలు వచ్చేవా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే ప్రజలు వారినే రద్దు చేయటం ఖాయమని జోస్యం చెప్పారు. ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదని, ప్రపంచానికి అని స్పష్టం చేశారు.**

హైదరాబాద్,జూన్ 10 (సాక్ష్యం): ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్



ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

మిగతా 5 లో..

# కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనం?

## రాహుల్ గాంధీతో అభిషేక్ బెనర్జీ భేటీ

## వార్తలను ఖండించిన టీఎంసీ వర్గాలు

న్యూఢిల్లీ,జూన్10(సాక్ష్యం): తృణమూల్ కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నారని వస్తున్న వార్తలను మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గాలు బుధవారం ఖండించాయి. తమకు అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశాయి. మంగళవారం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మధ్య భేటీ జరిగింది. అంతకు ముందు రోజు దిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వీరిద్దరూ ఆలింగనం చేసుకున్న ఒక ఫొటోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అయితే ఆ ఇరువురు మహిళా నేతల సమావేశానికి సంబంధించిన వివరాలను మాత్రం ఇరుపార్టీలు అధికారికంగా వెల్లడించ లేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే కాంగ్రెస్‌లో

మిగతా 5 లో..

తృణమూల్ కాంగ్రెస్ విలీనం కానుందనే ప్రచారాన్ని ఒక సీనియర్ టీఎంసీ నేత తోసిపుచ్చారు. వీటిని



## మమతా బెనర్జీకి భారీ షాక్..

- పార్టీలో ముదిరిన అంతర్గత సంక్షోభం
- రాజ్యసభకు మరో ఎంపీ రాజీనామా..!
- సుష్మితా దేవ్ తన పదవికి రాజీనామా
- సుఖేందు శేఖర్ రాయ్ కూడా రాజీనామా
- అదే బాటలో 20 మంది టీఎంసీ ఎంపీలు
- హిమంత బిస్వా శర్మతో సుష్మితా భేటీ

న్యూఢిల్లీ,జూన్10(సాక్ష్యం): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది. 15 ఏళ్ల అధికారానికి బ్రేక్ పడటమే కాకుండా, అధినేత్రి మమతా బెనర్జీ సైతం ఓడిపోవడంతో

మిగతా 5 లో..

## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

చెన్నై,జూన్10(సాక్ష్యం): తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో

మిగతా 2 లో..

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

- జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం చేస్తాం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం
- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ లక్ష్యం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- మెడిగడ్డ బ్యారేజ్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్



మేడిగడ్డ,జూన్ 10 (సాక్ష్యం): మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున

మిగతా 5 లో..

# సంపాదకీయం

### 370 రద్దుతో.. నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పకపోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రమంగా వేళ్లతో పెకిలేశారు. మోడీ ధృఢ సంకల్పానికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సంధిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేకాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా పూజ్యులను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తలాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్టమైన పునాదులతో పరిపాలనా నిర్మించడం. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధాని.. అటు స్వయంగా సమరయోధుడు అతుడు సాధకుడు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించాలనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేస్తున్న ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ సుదీర్ఘకాలంలో కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జనసీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రపతిభవ్య అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీ ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి గా వరుసగా నాలుగు పర్యాయాలు చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

మొదటిపేజీ తరువాయి..



భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷–లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

# మార్పు చూపించాం..

మొదటిపేజీ తరువాయి..

తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు లేవు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా



నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.

తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు



మొదటిపేజీ తరువాయి..

ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. పధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.


ఈ సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు. 'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం' అని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేం దుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అంటూ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం అభినందనలు తెలిపారు.

మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తిచేసుకున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకునున్నారు.

## ఆధునిక భారతం ఆవిష్కరించిన నెహ్రూ

### ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం
### 12 ఏళ్ల సుదీర్ఘ పాలనపై జైరామ్ రమేశ్ ఎద్దేవా

న్యూఢిల్లీ,జూన్10(సాక్ష్యం): ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఎన్నికైన ప్రధానుల్లో నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ రికార్డు సృష్టించారు. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ మోదీపై విమర్శలు గుప్పించింది. ఆయన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి పెద్ద సమస్యగా పరిణమించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ పాలనకు కాకుండా దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని అన్నారు. 1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి.. భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గం పాలనలో ఐదేళ్లలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందన్నారు. 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేశారని.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని అన్నారు. దేశంలోని జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, నీటిపారుదల ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో దేశం ప్రపంచ వ్యవహారాల్లో ఒక శక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1947-52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన రికార్డులను మోదీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ



భారీ మెజారిటీతో విజయం సాధించగా.. 2024లో మోదీకి కనీస మెజారిటీ కూడా రాలేదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని కావడానికి ఎన్డీఏ నేతలకు తాయిళాలు ఇచ్చి మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందన్నారు. మోదీ పరిపాలనలో స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు ముప్పులో పడ్డాయన్నారు. పేపర్ లీక్‌ల కుంభకోణాలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ ఆస్తులను కొందరు ధనవంతుల పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను బలహీనపరుస్తున్నారని విమర్శించారు.

## 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ÷ుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి అంశం




అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిస.।ఇతి.ఐనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

## వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు


మొదటిపేజీ తరువాయి..

పాటు.. ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసింది. గత నెలలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3) అభ్యర్థులతో ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల చేసిన బోర్డు.. మే 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టి తాజాగా ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్థీషియా విభాగాలకు సంబంధించి 174 పోస్టుల భర్తీ ప్రక్రియ గతంలోనే పూర్తి చేసిన అధికారులు.. మిగతా 30 విభాగాల్లో 433 పోస్టులకు ఎంపిక ప్రక్రియను తాజాగా పూర్తి చేశారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు?

మొదటిపేజీ తరువాయి..

నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.



# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్‌డిఏ

## జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన

## దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింప చేసిన మోడీ

## ఎన్‌డిఏ పక్షాల భేటీలో మోడీని అభినందించిన బాబు

న్యూఢిల్లీ,జూన్10 : దేశాభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తి.. ప్రధాని మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచదేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారని చెప్పారు.

రాష్ట్రాల అభివృద్ధికి కూడా కేంద్రం పూర్తిగా మద్దతిస్తోందన్నారు. ఎన్డీయే ఏర్పడింది ఎన్నికల కోసం కాదు.. దేశం కోసం. అధికారం కోసం కాదు.. జాతీయ ప్రయోజనాల కోసం. రాష్ట్రాల్లో ఎన్డీయే సాధిస్తున్న వరుస విజయాలే మా పనితీరుకు సాక్ష్యం. బిహార్, అస్సాం, పుదుచ్చేరిలో ప్రజలు మళ్లీ మాకు పట్టం కట్టారు. ఆయా రాష్ట్రాల్లో ఈ విజయాలు.. సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. బెంగాల్.. మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గర్లోనే ఉంది. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పాలన, ఆవిష్కరణలే భారత్‌కు అతిపెద్ద బలం. అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి భారతీయుడి మనోభావాలు అర్థం చేసుకున్న నాయకుడు.. మోదీ అని చంద్రబాబు అన్నారు. ప్రధానిగా మోదీ గత 12 ఏళ్ల ప్రయాణం... భారత ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. దేశం గర్వించేలా చేయడంతో పాటు, ప్రపంచదేశాల్లో భారతదేశ గౌరవం పెంచేలా ప్రధాని మోదీ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశాభివృద్ధికి నిదర్శనమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అసోం గెలుపు మరోసారి విశ్వాసం వ్యక్తం చేసిందని.. పుదుచ్చేరి విజయం కూడా మరోసారి ఎన్డీఏకి మద్దతు తెలిపిందని ప్రస్తావించారు. ఇవి కేవలం ఎన్నికల ఫలితాలు కావని... సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని అభివర్ణించారు. ఒకప్పుడు 'ఈరోజు పశ్చిమబెంగాల్ ఆలోచిస్తే... రేపు భారత్ పునరుజ్జీవం పొందడం గత 12 ఏళ్లలో వచ్చిన అతిపెద్ద మార్పు అని పేర్కొన్నారు. వికాస్ బీ... విరాసత్ బీ నూతన భారత నిర్మాణానికి మార్గదర్శకమని ఉద్ఘాటించారు. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పరిపాలన, ఆవిష్కరణల సమన్వయమే నూతన భారత్ బలమని తెలిపారు. 21వ శతాబ్దానికి భారత్ అందించే గొప్ప సందేశం ఇదేనని..




నిరంతరం శ్రమిస్తూనే రాష్ట్రాల అభ్యున్నతికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మద్దతుగా ప్రధాని నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసం ఏర్పడతాయని... కానీ ఎన్డీఏ కూటమి ఎన్నికల కోసం కాదని... దేశం కోసం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అధికారం కోసం కాదని... జాతీయ లక్ష్యసాధన కోసం ఎన్డీఏ ప్రయాణం సాగుతోందని తెలిపారు. దీనికి రాష్ట్రాల్లో వరుసగా ఎన్డీఏ సాధిస్తున్న విజయాలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. బీహార్‌లో 243 స్థానాల్లో 202 స్థానాల్లో గెలుపు ఎన్డీఏపై ప్రజల విశ్వాసానికి ఆలోచిస్తుంది' అనే పేరు ఉండేదని చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యం÷-ర తర్వాత దశాబ్దాల పాటు పశ్చిమబెంగాల్ అభివృద్ధి ప్రధాన స్రవంతికి దూరమైందని తెలిపారు. దేశ సంస్కరణలు, అభివృద్ధి వైపు సాగితే... పశ్చిమబెంగాల్ పాత రాజకీయాల్లోనే చిక్కుకుపోయిందని అన్నారు. తాజా మార్పుతో పశ్చిమబెంగాల్ దిశ మళ్లీ అభివృద్ధి వైపు సాగనుందని వివరించారు. మారుతున్న భారత ఆకాంక్షలకు అనుగుణంగా బెంగాల్ అడుగులు వేస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బెంగాల్ మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గరలోనే ఉందని ప్రస్తావించారు. భారతీయత ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ దేశానికి ఉన్న అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. వ్యవస్థను పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రధాని తీర్చిదిద్దుతున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. మన కాలంలో అత్యుత్తమ రాజకీయవేత్తల్లో మోదీ ఒకరని ఉద్ఘాటించారు. ప్రపంచ మార్పులో భారత్ భాగస్వామినే కాదని... దిశానిర్దేశర చేసే దేశంగా భారత్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

- కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం
- బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు

విశాఖపట్టణం,జూన్10: స్టీల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. బుధవారం విశాఖను



సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ఎ÷-లాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని జగన్ ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని సమాధానం ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో జగన్‌మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించిన ఆయన, బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రానికి రెండు లేఖలు కూడా రాశామని అన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల పక్షాన నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై గట్టిగా కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం సుమారు 10,500 మందిని తొలగించారని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్ట్, రెగ్యులర్ కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వ నేతలు చెబుతున్నారని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ (÷ఎఖా), బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇచ్చిందని గుర్తు చేసిన జగన్, అదే తరహాలో స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని జగన్ కోరారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు కొంత ఓపిక పట్టాలని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోటి రూపాయల పరిహారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి బయలుదేరారు.

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

న్యూఢిల్లీ,జూన్ 10 : జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# విశాఖ స్టీల్‌ను ముంచే కుట్ర చేసిన జగన్

## ఆనాడు పోస్కోతో కుమ్మక్కయి మూసివేతకు యత్నాలు

## ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్న తీరు దారుణం

## విశాఖ ప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

అమరావతి,జూన్ 10 : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమని ఎంఎస్ఎంఈ, ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్ఎంఎస్ 1లో జరిగిన రెండో పేలుడు వల్ల 8 మంది కార్మికులు మృతి చెందారని చెప్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఆరుగురికి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన అలర్ట్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రమాదం జరిగిన తర్వాత కేంద్ర మంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ ఘటనా స్థలానికి వెళ్ళి పర్యవేక్షించారని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించి.. వారిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ధైర్యం నింపారన్నారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణకు ఉమ్మడి కమిటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేశాయని చెప్పారు. మృతి చెందిన పర్మనెంట్ ఉద్యోగుల కుటుంబాలకు మొత్తం రూ.2 కోట్ల వరకు ఆర్థిక ప్యాకేజీ అందుతుందని వివరించారు. బాధిత కుటుంబంలో ఒకరికి పర్మనెంట్ ఉద్యోగంతో పాటు పిల్లల ఉచిత చదువుల బాధ్యత



ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు కూడా రూ.కోటి వరకు నష్టపరిహారం అందజేస్తామని మంత్రి కొండపల్లి చెప్పారు. బాధిత కుటుంబాలు ప్లాంట్ క్వార్టర్స్‌లోనే శాశ్వతంగా నివసించేలా వసతి కల్పిస్తామన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'శవ రాజకీయం' చేయడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించలేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ చెబుతున్న అబద్ధాలను నమ్మొద్దంటూ ప్రజలకు మంత్రి కొండపల్లి సూచించారు. గత ఐదేళ్లలో 'పోస్కో' కంపెనీతో రహస్య ఒప్పందాలు చేసుకుని.. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములపై కన్నేసింది నిజం కాదా? అని మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మంత్రి కొండపల్లి సూటిగా ప్రశ్నించారు.

సీఎం చంద్రబాబు చొరవతోనే కేంద్రం రూ. 500 కోట్లు ఇచ్చి.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుందని గుర్తు చేశారు. బాధిత కుటుంబాల ఓదార్పులోనూ ఓట్ల రాజకీయం చేయడం 'గొడ్డలి పార్టీ' నైజానికి నిదర్శనమంటూ వైసీపీ నేతల తీరును మంత్రి కొండపల్లి ఎండగట్టారు. కేంద్రం ఇచ్చిన రూ.11,440 కోట్ల నిధులపై లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయని.. ఒక్క రూపాయి కూడా మళ్లించలేదని కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. రా మెటీరియల్‌కు రూ.4 వేల కోట్లు, ఎ÷-లాంట్ అప్‌గ్రేడేషన్‌కే రూ.5 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. వైఎస్ జగన్ హయాంలో 30 శాతానికి పడిపోయిన ఎ÷-లాంట్ ఉత్పత్తి.. నేడు 95 శాతానికి పెంచామని గుర్తు చేశారు. ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడు 6 లక్షల టన్నుల మార్క్‌ను దాటి విశాఖ ఉక్కు సంస్థ ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో 12 మంది చనిపోతే కేవలం ముగ్గురికే రూ. కోటి ఇచ్చారని విమర్శించారు. నాడు బాధితులకు ఇచ్చింది కంపెనీ సొమ్మే కానీ, వైసీపీ ప్రభుత్వం సొంతంగా ఇచ్చింది కాదని పేర్కొన్నారు. ఎల్జీ పాలిమర్స్ బాధితులకు కట్టిస్తామన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏమైందో చెప్పాలని వైఎస్ జగన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. నాడు విమానాశ్రయంలో మీటింగులు పెట్టిన వైఎస్ జగన్.. నేడు ప్రజల వద్దకు మంత్రులు వెళ్తుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.

## మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం..

### దేశానికే అంకితమైన మోడీ జీవితం: పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్10: దేశ సేవలో ప్రధాని మోదీ 4,399 రోజుల పాలన పూర్తి అయ్యిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. మోదీ సేవలను కొనియాడారు. 'మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం' అని అన్నారు. దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోదీ, ఎన్డీఏ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, ఆధునికీకరణ దిశగా భారత సాయుధ దళాలకు కొత్త శక్తి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు కీలక స్థానం లభించిందని, జీ-20 సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లిందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రజలకు సేవలు చేరువయ్యాయని పవన్ అన్నారు. జనధన్-ఆధార్-మొబైల్ అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని చెప్పారు. యూపీఐ, డీబీటీ వ్యవస్థలతో డిజిటల్ చెల్లింపులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద కోట్ల మందికి వైద్య భరోసా లభిస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల కల సాకారమవుతోందని పవన్ ప్రస్తావించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు సదుపాయం కల్పించారన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల్లో భారీ అభివృద్ధి సాధించారని చెప్పారు. వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం మొదలైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయ మని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్ 2047 సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామ్యం వహిస్తుందన్నారు. భిన్నత్వమే భారతదేశ బలమని, భాషలు భారత గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. జై హింద్.. జై భారత్ అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## భారతీరాజా మృతికి చంద్రబాబు సంతాపం

అమరావతి,జూన్10: భారతీరాజా మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. భారతీరాజా మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'భారతీరాజా మరణం బాధాకరం. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు ఆయన చిరస్మరణీయ చిత్రాలు అందించారు. భారతీయ సినీ రంగానికి ఆయన మరణం తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## తనదైన ముద్ర వేసిన దర్శకుడు భారతీరాజా

### ఎక్స్ వేదికగా నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్10: ప్రముఖ దర్శకులు భారతీరాజా మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. భారతీరాజా మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు. 'ప్రముఖ దర్శకులు భారతీరాజా కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారు. గ్రామీణ నేపథ్యం, పల్లె ప్రజల జీవనం, ప్రేమానుబంధాలను, టీనేజర్స్‌కు ఉండే ఆకర్షణలు లాంటివి చూపించడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుంది. ఆ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పించాయి. అన్నయ్య చిరంజీవితో 'ఆరాధన' చిత్రం రూపొందించారు. అందులో 'అరె ఏమైంది...' అనే పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. సున్నితమైన ప్రేమ, సెంటిమెంట్ కథలే కాకుండా 'ఎర్ర గులాబీలు', 'టిక్ టిక్ టిక్' లాంటి థ్రిల్లర్స్‌తోను ప్రేక్షకులను మెప్పించారు. అలాంటి గొప్ప సృజనాత్మక దర్శకుడిని కోల్పోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు. భారతీరాజా మరణం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## భారతీరాజా గొప్ప సృష్టికర్త

### దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నివాళి


అమరావతి,జూన్10: ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ లెజెండరీ దర్శకుడు భారతీరాజా మృతి పట్ల స్పందిస్తూ ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసిన వర్మ.. ఆయన కేవలం ఒక దర్శకుడు మాత్రమే కాదని, సినిమా రంగాన్ని కొత్త కోణంలో చూపించిన ఒక గొప్ప సృష్టికర్త అని వర్మ అభివర్ణించారు.

భారతీయ చలనచిత్ర రంగానికి 'శ్రీదేవి' లాంటి దేశంలోనే అతిపెద్ద లేడీ సూపర్ స్టార్‌ను అందించడమే కాకుండా.. సత్యజిత్ రే మార్క్ 'యదార్థవాదాన్ని' హృషికేష్ ముఖర్జీ తరహా 'పాత్రలను', బసు ఛటర్జీ శైలి 'సిట్యుయేషనల్ కామెడీలను' భారతీరాజా అద్భుతంగా మిక్స్ చేశారంటూ వర్మ చెప్పుకొచ్చాడు. నేల విడవని సంప్రదాయాలు, మన మూలాలకు దగ్గరగా ఉండే కథలతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆయన కనెక్ట్ చేశారు. భాషలతో సంబంధం లేకుండా అందరి హృదయాలను గెలుచుకున్న ఆయన ఒక నిజమైన సృష్టికర్త అంటూ రామ్ గోపాల్ వర్మ రాసుకోచ్చాడు.

## నిర్ణీత వ్యవధిలో విద్యుత్ ప్రాజెక్టుల పూర్తి

### విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలి అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

అమరావతి,జూన్10: రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల నిర్మాణాలను నిర్ణీత కాల వ్యవధి లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. బుధవారం అమరావతిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ



సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజ్ సమస్యలు రాకుండా సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అధికారులకు సూచించారు.ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలలో సరఫరాను పునరుద్ధరించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ కేబులింగ్ వ్యవస్థతో భవిష్యత్తులో అత్యవసర సర్వీసులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ దేవాలయాల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినప్పుడు.. తక్షణ పునరుద్ధరణకు గల అవకాశాలపై ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి చర్చించారు. ఈ సమీక్షకు ట్రాన్స్ కో జేఎండీ, సీపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు హాజరయ్యారు.

## 127 మంది సైబర్ నేరస్తుల అరెస్ట్

### సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి

హైదరాబాద్,జూన్10 (సాక్ష్యం): 127 మంది సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బుధవారం వెల్లడించింది. సైబర్ మోసాలపై ఆపరేషన్ క్రాక్ డౌన్ 3.0లో భాగంగా ఈ నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 127 మంది సైబర్ నేరస్తులను గుర్తించామని వివరించింది. వారిలో 57 మంది తెలంగాణకు చెందిన వారని.. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పేర్కొంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, జిల్లా సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ కేంద్రాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయని వివరించింది. 48 మంది నకిలీ గుర్తింపుతో ఈ మోసాలకు పాల్పడ్డారని తెలిపింది. 27 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, 11 మంది డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో ఉన్నట్లుగా గుర్తించామని చెప్పింది. ఈ నిందితుల్లో 68 శాతం మంది పాత సైబర్ నేరస్తులేనని టీజీసీఎస్‌బీ స్పష్టం చేసింది. ప్రజలను మోసం చేసినట్లు 103 మంది నిందితులు తమ విచారణలో వెల్లడించారని తెలిపింది. ఈ నిందితుల వద్ద నుంచి కీలక డిజిటల్ ఆధారాలతోపాటు పలు పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు టీజీసీఎస్‌బీ పేర్కొంది. అయితే 24 మంది నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించింది. వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు చెప్పింది. సైబర్ నేరాల కట్టడికి మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్పష్టం చేసింది.

## భిక్కనూరులో ప్రజాపాలన గ్రామసభ

### గ్రామస్థుల నుంచి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

నిజామాబాద్,జూన్ 10 (సాక్ష్యం): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిజామాబాద్ జిల్లా భిక్కనూరులో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించి వినతిపత్రాలు స్వీకరించారు. పూరిగుడిసెలను గుర్తించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ అర్హులైన యువతను ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జన సంరక్షణ?మన సంరక్షణ కార్యక్రమం కింద 36 వేల కందకాలు తవ్వినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం, ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఎల్ఎస్పీ నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.వి. గిరి, సర్పంచ్ రేఖ, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత కెటిఆర్ సంతాపం

హైదరాబాద్,జూన్10(సాక్ష్యం): కోలీవుడ్ దర్శక దిగ్గజం భారతీరాజా మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతో కలిచివేసిందని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. భారతీయ సినిమాను వినూత్న మార్గంలో నడిపించిన మహోన్నత కళాకారుడు భారతీరాజా అని కేటీఆర్ కొనియాడారు. ఆయన రూపొందించిన సినిమాలు తరతరాలపాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. భారతీరాజా మరణం తమిళ సినీపరిశ్రమే కాకుండా భారతీయ సినిమాకు తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబ సభ్యులకు, సినీ పరిశ్రమకు చెందిన సహచరులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారతీరాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## భారతీరాజా భౌతిక కాయం వద్ద సిఎం విజయ్ నివాళి

చెన్నై,జూన్10(సాక్ష్యం): దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజాకు సిఎం విజయ్ నివాళి అర్పించారు.

భారతీరాజా నివాసానికి వెళ్లిన సిఎం ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమిళ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేశారు. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు, తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపకుడు, దిగ్గజ దర్శకుడైన భారతీరాజా తుది వీడ్కోలుకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ అభ్యర్థనకు స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రభావవంతమైన, విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి భారతీరాజా అని కొనియాడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులను మరియు మరెన్నో ప్రశంసలను ఆయన అందుకున్నారని గుర్తుచేసింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన సహకారం అసమానమైనదని, ఒక దర్శకుడిగా ఎన్నో కాలాతీత క్లాసిక్ చిత్రాలను సృష్టించడమే కాకుండా, నటుడిగానూ తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. 2020లో పలువురు నిర్మాతలతో కలిసి భారతీరాజా 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' ను స్థాపించారని, ఆయన దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఈ అసోసియేషన్ స్థిరంగా వృద్ధి చెంది ప్రస్తుతం 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలకు ప్రాతినిధ్యం వహిస్తోందని సంస్థ తెలిపింది.

# ప్రపంచానికే ఫ్యూచర్‌సిటీ



మొదటిపేజీ తరువాయి..

అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనం?



మొదటిపేజీ తరువాయి..

ఆధార రహితమైన వార్తలుగా అభివర్ణించారు. "విలీనం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. దీనిపై వస్తున్న వార్తలు అన్నీ అవాస్తవాలు" అని తేల్చిచెప్పారు. అటు కాంగ్రెస్ పార్టీ సైతం ఈ ప్రచారాన్ని ఖండించింది.ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు అన్నీ విభేదాలు వదిలి, కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీని ఎదుర్కొనేందుకు కూటమిలోని పార్టీల మధ్య మరింత సమన్వయం, ఐక్యత అవసరం అని నొక్కిచెప్పారు.ఇదిలా ఉండగా, బుధవారం టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఇండియా కూటమి భేటీ తర్వాత ఇరుపార్టీల మధ్య జరుగుతున్న నిరంతర చర్చల్లో భాగంగానే రాహుల్–అభిషేక్ భేటీ అయ్యారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే వాస్తవంగా వారు ఏం మాట్లాడారో మాత్రం తెలియరాలేదు.ఇటీవల జరిగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత, టీఎంసీ పార్టీలో అంతర్గత పోరు మొదలైంది. పార్టీ లోపల తీవ్ర అసమ్మతి చేలరేగింది. అధినాయకత్వం మీద తిరుగుబాట్లు జరిగాయి. ఈ తరుణంలోనే కాంగ్రెస్ అగ్రనేతలతో మమత, అభిషేక్ భేటీ కావడంతో పార్టీ విలీనం గురించి వార్తలు చక్కర్లు కొట్టాయి. కాగా, 1998లో కాంగ్రెస్ పార్టీ నుంచి విడిపోయిన తర్వాత మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆ తర్వాత తన పార్టీని బంగాల్‌లో అత్యంత శక్తివంతమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దారు. 2011లో బంగాల్‌లో కమ్యూనిస్టుల 34 ఏళ్ల సుదీర్ఘ పాలనకు చరమగీతం పాడి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. వరుసగా మూడు సార్లు బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తిరుగులేని నేతగా ఎదిగారు. కానీ 2026లో ఆమె అదృష్టం తిరగబడింది. బీజేపీ చేతుల్లో టీఎంసీ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. అయితే ఇక్కడితో మమత కష్టాలకు చెక్ పడలేదు. ఓటమి తర్వాత ఆ పార్టీ ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై తిరుగుబాటు చేశారు. గతవారం ఆ పార్టీకి చెందిన మొత్తం 80 మంది శాసనసభ్యుల్లో 58 మంది టీఎంసీ శాసనసభా పక్షం నుంచి విడిపోయారు. అంటే ఏకంగా మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు టీఎంసీ నుంచి విడిపోయారు. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నాయకత్వంలో అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు పొందారు. చివరికి టీఎంసీ పార్టీ సంక్షోభం దిల్లీకి కూడా చేరింది. ఎంపీ కాకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో 20 మంది తిరుగుబాటు ఎంపీలు తాము టీఎంసీ నుంచి వేరుగా ఉంటామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు లేఖ రాశారు. మరి దీదీ ఈ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని ఎలా పరిష్కరిస్తారో చూడాలి.

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి



మొదటిపేజీ తరువాయి..

౽ సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉ ఖభీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016–17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ–డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ పక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ÷ఎనరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్‌స్టలెంట్ సంస్థ , ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని ఆయన తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ పక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన స్కౌర్ డెప్త్, కట్–ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో మెడిగడ్డతో పాటు అన్ని బ్యారేజీలను పునరుద్ధరిస్తాం. తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టులను తిరిగి సురక్షితంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకువస్తాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## 2047 సంవత్సరం వరకూ మోదీయే దేశ ప్రధాని

మొదటిపేజీ తరువాయి..

దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నరేంద్ర మోదీ ఒక చరిత్రాత్మక మైలురాయి అధిగమించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆయన 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. 4,399 రోజులు.. భారతీయ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిన చరిత్రాత్మక రోజులని చెప్పారు. గరీబ్ కల్యాణ్ నుంచి మహిళా సాధికారత వరకు.. రైతుల గౌరవం నుంచి యువతకు అవకాశాల సృష్టి వరకు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు.. ఆర్థిక వ్యవస్థ ఫార్మలైజేషన్ నుంచి ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం వరకు.. ప్రతి రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, బలమైన సరిహద్దులు, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, భారత స్టార్టప్ సంస్కృతి ఎదుగుదల.. ఇవన్నీ జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగాన్ని సూచిస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## మమతా బెనర్జీకి భారీ షాక్..

మొదటిపేజీ తరువాయి..

పార్టీపై ఆమె పట్టు సడలుతోంది. తాజాగా టీఎంసీ కీలక నాయకురాలు, రాజ్యసభ ఎంపీ సుష్మితా దేవ్ తన పదవికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. రాజీనామా అనంతరం ఆమె అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మతో భేటీ కావడం, ఆమె త్వరలోనే బీజేపీ గూటికి చేరుతారనే ప్రచారానికి బలం చేకూర్చింది. సుష్మితా దేవ్‌కు ముందే సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ కూడా రాజ్యసభకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.ఇప్పటికే రాష్ట్రంలో రీతబ్రత బెనర్జీ నేతృత్వంలో 61 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇప్పుడు ఎంపీలు కూడా అదే బాట పట్టారు. ఎన్డీఏ కూటమిలో చేరేందుకు సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు సిద్ధంగా ఉన్నారని రెబెల్ ఎంపీ కాకోలీ ఘోష్ ప్రకటించడం సంచలనంగా మారింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కూడా లేఖ సమర్పించారు. మరోవైపు, రెబెల్ గ్రూప్‌లో ఉన్న ఎంపీ పార్థ భౌమిక్ తన అధికారిక నివాసంలో నడుస్తున్న టీఎంసీ ఢిల్లీ కేంద్రీయ కార్యాలయాన్ని వెంటనే ఖాళీ చేయాలని అభిషేక్ బెనర్జీకి లేఖ రాయడం పార్టీలో తిరుగుబాటు తీవ్రతను స్పష్టం చేస్తోంది. తిరుగుబాటు వర్గంపై టీఎంసీ సీనియర్ నేత




కళ్యాణ్ బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ నచ్చని వారు పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని, నైతికత ఉంటే కాకోలీ ఘోష్ తనతో ఉన్న ఆ 20 మంది ఎంపీల పేర్లను బహిరంగపరచాలని సవాల్ విసిరారు. పార్లమెంట్‌లో ప్రత్యేక కూటమిగా ఏర్పడటానికి అవసరమైన 19 మంది ఎంపీల మద్దతును రెబెల్స్ కూడగట్టలేరని మమత వర్గం గట్టి నమ్మకంతో ఉంది. మరోవైపు మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలు, టీఎంసీలో తీవ్రవాదిగా పేరుగాంచిన సయానీ ఘోష్ కూడా తిరుగుబాటు చేశారని తెలుస్తోంది ఈ తిరుగుబాటు బృందంలో సయానీ ఘోష్, సుదీప్ బందోపాధ్యాయ్‌తో సహా 20 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారని వర్గాలు తెలియజేస్తున్నాయి. తాజాగా ఇద్దరు రాజ్యసభ ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్ కూడా రాజీనామా చేశారు. సయానీ ఘోష్ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి టీఎంసీ ఎంపీగా ఉన్నారు. ఓటమి భారంతో కుంగిపోయిన మమతా బెనర్జీకి వరుసగా తగులుతున్న ఈ ఎదురుదెబ్బలు కోలుకోలేనివిగా మారాయి. ఇప్పుడు తిరుగుబాటుదారుల లేఖపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకోబోయే నిర్ణయంపైనే టీఎంసీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## పశ్చిమాసియాలో మళ్లీ మొదలైన యుద్ధం..

మొదటిపేజీ తరువాయి..

చర్చలు జరిగే ప్రయత్నాలు కష్టతరం కావచ్చు. నాలుగు ఇరాన్ డ్రోన్‌లు ఆ ప్రాంతంలోని నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయని అమెరికా సైన్యం నమ్ముతోందని ఒక అమెరికా అధికారి రాయిటర్స్‌కు తెలిపారు. ఆ తరువాత అమెరికా ఇరాన్ నిఘా స్థావరాలపై దాడి చేసింది. వాటిలో గోరుక్, కేశం ద్వీపాలు ఉన్నాయి. ఈ రెండు హర్మూజ్ జలసంధికి చాలా దగ్గరగా ఉన్నాయి. అమెరికా తాజా దాడులను ఏప్రిల్ 8న జరిగిన కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనగా ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇలాంటి ఉల్లంఘనలు పదేపదే జరగడం వల్ల అమెరికా ఉద్రిక్తతలను తగ్గించే ఉద్దేశంలో లేదని తాము భావిస్తున్నట్లు స్పష్టం చేసింది. చట్టవిరుద్ధమైన చర్యలు, ఉద్రిక్తతలు పెరగడానికి అమెరికా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.తమ దేశంపై అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ తెలిపింది. వారి 4 ట్యాంకర్లపై కూడా కాల్పులు జరిగాయి. అనుమతి లేకుండా హర్మూజ్ నుంచి వెళ్లడానికి ప్రయత్నించిన ఓడలు, ట్యాంకర్లపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. కువైట్ సైన్యం తెలిపిన ప్రకారం, ఉదయం దేశ వైమానిక సరిహద్దుల్లోకి ప్రవేశించిన 7 బాలిస్టిక్ క్షిపణులను అది అడ్డుకుంది. అంతేకాకుండా, మిస్సైల్స్ అనేక నివాస ప్రాంతాల మీదుగా వెళ్ళాయి. దీని వల్ల కొంత



శిథిలాలు అక్కడ పడ్డాయి. ఇరాన్ దాడి వల్ల ఆస్తికి చాలా నష్టం జరిగిందని కువైట్ సైన్యం తెలిపింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. మరోవైపు బహ్రెయిన్‌లో సైరన్‌లు మోగాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రభుత్వం కోరింది. అమెరికా, ఇరాన్ మధ్య పరిస్థితులు మరింత దిగజారుతున్న సమయంలో పాకిస్తాన్ మంత్రులు ఇరాన్‌కు వెళ్తున్నట్లు సమాచారం. ఇరాన్ సైన్యం తమపై చేస్తున్న దాడులను కువైట్, బహ్రెయిన్ ఖండించాయి. ఈ దేశాలు ఇరాన్ దాడులను బహిరంగ దాడిగా పేర్కొంటూనే, దీని వల్ల పౌరుల భద్రతకు ముప్పు పెరిగిందని పేర్కొన్నాయి. ఈ దాడులు లక్ష్యాన్ని చేరుకోవడానికి ముందే అమెరికా సైన్యం విజయవంతంగా అడ్డుకుందని తెలిపారు.

కాగా ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ఒప్పందం త్వరలో ఖరారు అవుతుందని చెబుతున్నప్పటికీ, మరోవైపు ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. ఏప్రిల్‌లో అమలులోకి వచ్చిన కాల్పుల విరమణ తర్వాత క్షిపణి దాడి చేయడం ఇదే మొదటిసారి. దీంతో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ మేఘాలు కమ్ముకున్నాయి. టెహ్రాన్ ప్రతీకార చర్యకు వార్నింగ్ ఇచ్చిన ఒక రోజు తర్వాత ఈ దాడి జరిగింది. ఇరాన్ మిస్సైల్స్ దాడి తర్వాత, ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్ శబ్దాలు వినిపించాయి. అంటే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని దాని అర్థం. ఇజ్రాయెల్ సైన్యం కనీసం మూడు ఇరాన్ క్షిపణి దాడులను అడ్డుకున్నట్లు పేర్కొంది. అయితే ఉత్తరాన అనేక పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. కనీసం 10 బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ ఎన్ని మిస్సైల్స్ ప్రయోగించిందో తెలియాల్సి ఉంది. ఇజ్రాయెల్ ఆదివారం (జూన్ 7) ఏ హెచ్చరిక లేకుండా బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై దాడులకు దిగడం పరిస్థితిని దిగజార్చింది. దాంతో తాము ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. చెప్పినట్లుగానే ఇరాన్ మిస్సైల్స్ దాడులతో ఇజ్రాయెల్ మీద విరుచుకుపడింది. ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు మళ్లీ మొదలుపెట్టడంతో పశ్చిమాసియా ఘర్షణ ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. తమ దేశంపై ఇజ్రాయెల్ చేసిన దాడులపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ స్పందించింది. 'దాడులు జరిగితే ప్రతీకార చర్యలు మరింత తీవ్రంగా ఉంటాయి. ప్రాంతంలోని అన్ని అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలను మేం టార్గెట్ చేస్తామని' హెచ్చరించింది. లెబనాన్, ఇరాన్ తీరప్రాంతాలు, హర్మూజ్ జలసంధి చుట్టుపక్కల ఉన్న నౌకలపై జరిగిన దాడుల్ని ప్రస్తావించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ మాట్లాడుతూ, ఏరోస్పేస్ ఫోర్స్ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌లోని రామాట్ డేవిడ్ ఎయిర్ బేస్‌ను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. ఈ దాడి ఒక హెచ్చరిక మాత్రమేనని, దాడి మళ్లీ జరిగితే ఇరాన్ ప్రతిస్పందన ఊహించలేరని ఇజ్రాయెల్‌ను హెచ్చరించింది. ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా, ఇజ్రాయెల్ తమ టార్గెట్స్ అవుతాయని పేర్కొంది. అన్ని రంగాలలో కాల్పుల విరమణ ముగుస్తుందనే షరతుపై ఇరాన్ కాల్పుల విరమణను అంగీకరించిందని, అయితే అమెరికా, ఇజ్రాయెల్ తమ వాగ్దానాలు, హామీలను నెరవేర్చలేదని క్లారిటీ ఇచ్చింది.

## బ్రహ్మపురి కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డికి వినతి



**ఉప్పల్, జూన్ 10 (సాక్ష్యం):** శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిని కలిసి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలో చాలా కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని పరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుడి నరేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు బొడ్డు నాగమల్లయ్య, షేక్ అన్వర్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు యాకుబ్ పాషా, పాటి రాజ్ రెడ్డి, బూడిద స్వామి గౌడ్, బీసా సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రవికాంత్ గౌడ్, భూమల్ల లక్ష్మణ్, గురువయ్య పాల్గొన్నారు. అదేవిధంగా ఉమ్మడి మల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కప్పర సాయి, కోయిగూర బాలరాజ్ గౌడ్, విజయ్ రెడ్డి, హెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ నాయకులు రూపేందర్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి రూ.50 వేల సబ్సిడీ చెక్కు



**నారాయణఖేడ్, జూన్ 10:జూన్ 10( సాక్ష్యం న్యూస్ )** డిసెబుల్ వెల్ఫేర్ ఈఆర్ఎస్ పథకం ద్వారా మంజూరైన రూ.50 వేల సబ్సిడీ చెక్కును 12వ వార్డు కౌన్సిలర్ షారుక్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి లబ్ధిదారుడు షైక్ ముదస్సిర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ..ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ సహకారంతో వికలాంగుడైన షైక్ ముదస్సిర్‌కు మెడికల్ వ్యాపారం నిర్వహించేందుకు రూ.50 వేల సబ్సిడీ మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వికలాంగులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సహాయం ద్వారా ముదస్సిర్ తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## మెట్టుగూడలో డ్రైనేజీ, రోడ్లు,
## వీధి దీపాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ నేత ర్యాల రాజేందర్ యాదవ్



**సికింద్రాబాద్, జూన్ 10 (సాక్ష్యం) :** సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ బుధవారం మెట్టుగూడ ముదిరాజ్ సంఘం భవనం వెనుక ప్రాంతాన్ని సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించారు.స్థానిక నివాసి స్టాలిన్ సమాచారం మేరకు అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్ల సమస్యలను ర్యాల రాజేందర్ యాదవ్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, స్థానికులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ర్యాల రాజేందర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుష్పమ్మ, సుజాత, గంగ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం వల్ల
## తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం

- ప్రత్యామ్నయ పంటల సాగుకు రైతులకు అవగాహన కల్పించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు



**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 10 :** వాతావరణ శాఖ సూచన మేరకు ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నయ పంటల సాగుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహాదేవపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హసీనా భాను అధ్యక్షతన జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 4,6,8,10 తేదీలలో అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో విజయవంతంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి ప్రణాళిక బద్దంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాలలో ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫీడ్ బ్యాక్ ని కూడా తీసుకుంతున్నామని తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు ఎల్ నినో ప్రభావం ఉన్నందున వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని రైతులు సహకరించాలని తెలిపారు. వాతావరణ శాఖ సలహాలు సూచనలు పాటించడం వల్ల వ్యవసాయంలో మెళకువలు పాటించాలని తెలిపారు. అలాగే అధికంగా యూరియా వినియోగించకుండా నానో యూరియా వినియోగించేలా రైతులకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## అనారోగ్యంతో ఎర్రబెల్లి నరేందర్ రావు మృతి

- నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రాయపర్తి, జూన్ 10(సాక్ష్యం):** రాయపర్తి మండలం, కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ రావు గత కొద్దికాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నరేందర్ రావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎర్రబెల్లి నరేందర్ రావు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డీ, తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, మండల సీనియర్ నాయకులు పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఆకుల సురేందర్ రావు, మాందాటి సుదర్శన్ రెడ్డి, కాంచనపల్లి వనజరాణి, ఎనగందుల మురళి, కళ్యాణ్ గౌడ్, కొండాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎండి ఖదీర్, గ్రామ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంగిరేకుల మధుకర్, స్థానిక నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

## మంత్రి కృషితో టేక్మాల్‌కు రూ.51.63 లక్షల సంక్షేమ వరం

- 80 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**మెదక్ జిల్లా, టేక్మాల్, జూన్ 10 (సాక్ష్యం న్యూస్):** పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని టేక్మాల్ మండల తహశీల్దార్ తులసిరాం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో టేక్మాల్ మండలానికి మొత్తం రూ.51,63,756 విలువైన సంక్షేమ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 41 మంది లబ్ధిదారులకు రూ.41,04,756 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులు, 39 మంది లబ్ధిదారులకు రూ.10,59,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా ప్రజాపాలన కొనసాగుతోందని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో ఆందోల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, త్వరలోనే ఎడ్యుకేషన్ హబ్‌గా ఆవిర్భవించబోతోందని పేర్కొన్నారు. పలు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సుధాకర్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు, మెదక్ మైనార్టీ చైర్మన్ మజర్, మహేష్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ఆకులపల్లి పాపయ్య, పులి సత్యం, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సేవాలాల్, వివిధ గ్రామాల సర్పంచులు అవినాష్, ఇర్షద్‌తో పాటు మండల నాయకులు చంద్రన్న, బాల్ రెడ్డి, లక్ష్మణ్, సామెల్, సిద్ధు, సుబ్బారావు, నాగయ్య, మల్లేశం, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్ తదితరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జొన్న రైతులకు భరోసా.. టేక్మాల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రూ.3,699 మద్దతు ధరతో జొన్నలకు మార్కెట్ భరోసా



**మెదక్ జిల్లా, టేక్మాల్, జూన్ 10, (సాక్ష్యం న్యూస్ ) :-** రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పాల్వంచ చౌరస్తాలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. సంఘం సీఈఓ వెంకటేశం, అధ్యక్షుడు మొగులయ్య సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ అధ్యక్షత వహించారు.జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, పాల్వంచ గ్రామ సర్పంచ్ రుక్మిణి బాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ యూసుఫ్, టేక్మాల్ సర్పంచ్ సుధాకర్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మజాహర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, సాగర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,699 మేరకు జొన్నలను కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు టోకెన్ల ప్రకారం తమ పంటను తీసుకువచ్చి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు నుంచి జొన్నల కొనుగోలు పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రం సజావుగా సాగేందుకు రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీఏఆర్ -- ఐఐఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సంగప్ప, డాక్టర్ ఆమసిద్ధ, డాక్టర్ రఫీ, ప్రశాంత్‌లు రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రైతులలో చిరుధాన్యాల సాగుపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో జొన్నల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## నవత్వాన్ని చాటుకున్న సీఐ రాజగోపాల్

- రోడ్ ప్రమాద దంపతులకు అండ
- ఖాకీ అంటే భయం కాదు - భరోసా





**పర్వతగిరి, జూన్ 10(సాక్ష్యం):** మన కళ్ల ముందే రోడ్డు ప్రమాదం జరిగితే పక్కకు దారిచూసుకొని వెళ్లే నేటి రోజుల్లో ఓ కాకి డ్రెస్ వేసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎదుట భార్య భర్త లిద్దరు రోడ్డు ప్రమాదానికి గురై రక్తం మరుకలతో ఉన్న బాధితులకు చేయూత నిచ్చి పోలీసు అంటే లాఠీ, కేసులు మాత్రమే కాదు మానవత్వం, సేవాభావం కూడా అని నిరూపించారు పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్. వివరాల్లోకి వెళ్లగా హన్మకొండ జిల్లా మడికొండ గ్రామానికి చెందిన శ్రీనివాస్, పద్మ అనే దంపతులు శాయంపేట సమీపంలో రోడ్ పై ప్రమాదవ శాత్తు కింద పడి రక్తం పు మడుగు లో కొట్టుమిట్టడుతున్న సందర్బ సమయం లో పర్వతగిరి సీఐ మానవత్వంతో ఆపదలో ఉన్న పద్మ దంపతులకు సకాలంలో స్పందించి చేయూతనిచ్చి అందరి మన్ననలు పొందారు. అత్యవసర పరిస్థితిని గుర్తించిన సీఐ వెంటనే ఓ ఆటో లోసమీపంలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుడికి అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఆయన చూపిన బాధ్యతా యుతమైన వ్యవహారశైలి, సేవాభావం గ్రామస్తులను కదిలించింది. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అంటే కేసులు నమోదు చేయడం, చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు అని. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడటం కూడా మా విధి అని అన్నారు. ఎవరైనా కష్టంలో ఉంటే వారి కులం, మతం చూడకుండా సహాయం చేయడం మా ధర్మం అని, ఖాకీ డ్రెస్ వేసుకున్నందుకు మేము ప్రజలకు దూరంగా ఉండకూడదని ప్రజలకు మరింత దగ్గర కావాలని అన్నారు. ఇది నా విధి, నా బాధ్యత అని సిఐ అన్నారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన గ్రామస్తులు సీఐ రాజగోపాల్‌ను అభినందనలతో ముంచెత్తారు. ఇలాంటి అధికారులు ఉంటే పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నా పర్వతగిరి సీఐ రాజగోపాల్ చూపిన సేవాభావం, బాధ్యతాయుతమైన వ్యవహారశైలిని స్థానికులు అభినందించారు. పోలీసు శాఖ ప్రజలకు భరోసాగా నిలుస్తుందనే నమ్మకాన్ని ఆయన చర్య మరోసారి చాటిందని పలువురు పేర్కొన్నారు.

## హెల్మెట్ సీటుబెల్ట్ మీ కుటుంబానికి రక్షాకవచం

- డీజీపీ స్వాతి లక్రా పిలుపుతో మహబూబ్‌నగర్‌లో ఘనంగా "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం



**మహబూబ్‌నగర్, జూన్ 10 ( సాక్ష్యం బ్యూరో )** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బాలానగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరియు కళాశాలలో బుధవారం "అరివ్ అలైవ్ " రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ ఆర్గనైజేషన్ ఓ హోంగార్డ్స్ తెలంగాణ స్వాతి లక్రా మాట్లాడుతూ "మీ కోసం ఒక కుటుంబం ఇంట్లో ఎదురుచూస్తోంది... ఆ విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి" అని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలు, తీవ్ర గాయాల్లో దాదాపు 90 శాతం వరకు హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంతో తగ్గించవచ్చని తెలిపారు. కుటుంబ పెద్ద ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులను వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.అంతకుముందు జిల్లా ఎస్పీ దరావత్ జానకి సభను ఉద్దేశించి ప్రారంభ ప్రసంగం చేశారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రమాదం జరిగిన తొలి గంటలో వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు అధికంగా ఉంటాయని డీజీపీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి అంశాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, భారీ వాహనాల డ్రైవర్లు, విద్యార్థులకు ప్రత్యేకంగా రోడ్డు భద్రతా సూచనలు అందించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మైనర్లకు వాహనాలు ఇవ్వకపోవడం, అతివేగాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు.ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని డీజీపీ స్వాతి లక్రా పిలుపునిచ్చారు. గుడ్ సమారిటన్ నిబంధనల ప్రకారం సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించేందుకు మానవత్వంతో స్పందించాలని సూచించారు. అనంతరం డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా ప్రజలకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వాణి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ భాను మిత్రా, జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ సౌమ్య, వైద్య అధికారి డాక్టర్ నేహా, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, బాలానగర్ ఎస్ఐ నరేందర్, ఇతర పోలీసు అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది, ఆటో, క్యాబ్, భారీ వాహనాల డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

● సిపిఐ నాయకులకు పోలీసు మధ్య తోపులాట, తీవ్ర ఉద్రిక్తత ● ప్రజలపై భారం తగ్గించకపోతే ఆందోళన ఉద్రితం చేస్తాం ● సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్

**(సాక్ష్యం) జయశంకర్ – భూపాలపల్లి, జూన్ 10:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, మోట పలుకుల రమేష్ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పెరిగిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లే



ప్రయత్నంలో పోలీసులు అడ్డుకోవడంతో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, మోట పలుకుల రమేష్ లు మాట్లాడుతూ "పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజల జీవితం దుర్భరంగా మారింది. రైతులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోంది" ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న క్రమంలో గేటు లోపటికి దూసుకెళ్తున్న సిపిఐ నాయకులను అడ్డుకునే ప్రయత్నంలో సిపిఐ నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట

## భూపాలపల్లి మున్సిపాలిటీని
## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

**(సాక్ష్యం) జయశంకర్ – భూపాలపల్లి, జూన్ 10:** బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2, 15వ వార్డుల సంయుక్త వార్డు సభ ఫకీర్ గడ్డ హనుమాన్ టెంపుల్ ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, ప్రజలు సూచించిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని తెలిపారు. భూపాలపల్లి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం వార్డుల ప్రజల నుంచి వినతులు, సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర




కొమురయ్య గౌడ్ ,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ ,అధికారులు,ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జూన్ 21న ఇందిరాపార్క్‌లో
## ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

● మహబూబ్‌నగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్, జూన్ 11 ( సాక్ష్యం బ్యూరో)** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జూన్ 21న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల నేతలు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి అధ్యక్షతన జరగనున్న ఈ సమ్మేళనం పోస్టర్‌ను బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. జిల్లా ఉద్యమకారుల సంఘం కో-కన్వీనర్ నాచ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం వద్ద పోస్టర్




ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఉద్యమకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ ఆత్మీయ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జూన్ 21న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారుల సంక్షేమం, పెండింగ్ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమ్మేళనంలో చర్చించనున్నట్లు నేతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ రహీం, పియు జేఏసీ చైర్మన్ నరేందర్, ఉద్యమకారులు గోపాల్ మాదిగ, సుదీప్ రెడ్డి, సురేష్, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వెంట పచ్చని చెట్లు నరికివేత

● చర్యలు తీసుకోవాలని తాహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

**సాక్ష్యం న్యూస్ జూన్ 10**

యాదాద్రి జిల్లా,సంస్థాన్ నారాయణపురం మండలం , రాధా నాయక్ తండ గ్రామపంచాయతీ పరిధిలోని సత్యా తండా కు వెళ్లే దారిలో గ్రామ ప్రజలు రోడ్డు వెంట మంచి వాతావరణం,సహజ వనరులు ఇవ్వాలన్న లక్ష్యంతో చెట్లను నాటారు. ఎంతో ప్రజాధనం వెచ్చించి పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు నరికి వేస్తున్న కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవరణాన్ని కాపాడుకోవడంతోపాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓవైపు మొక్కలు నాటుతుంటే... మరోవైపు కొందరు





వ్యక్తులు రోడ్డు పక్క ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికి వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపుల చెట్ల నరికివేతకు గురవుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల ఎనిమిదో తారీఖున కొందరు వ్యక్తులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికి వేశారని, గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాము మరియు సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని



నారాయణపురం ఎమ్మార్వో కు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామ పెద్దలకు గాని గ్రామ ప్రజలకు గాని ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా హరితహారం చెట్లను నరికి వేయడం జరిగిందని సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోవర్ధన్ నాయక్, సోమ నాయక్ జైగారం రాము బలరాం బాలాజీ నాయక్ శ్రీను పాల్గొన్నారు

## భీక్యాతండలో గ్రామ సభ: ఎంపీడీవో హుస్సేన్

**కోదాడ జూన్ 10, (సాక్ష్యం)**

ప్రజాపాలనలో భాగంగా భీక్యాతండలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మాట్లాడుతూ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యలడిగి తెలుసుకొన్నారు, ప్రజలు చెప్పిన సమస్యలను అక్కడికక్కడే వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వివిధ శాఖల అధికారులు గ్రామ సభలో పాల్గొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ బాణోతు ఝాన్సీ బాలాజీ మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహాయ సహకాలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసి తండతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మంచి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వర్షాకాలానికి పారిశుధ్యం గురించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ పెంటదిబ్బలు ఏర్పాటుచేయవద్దన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ బాణోతు ఝాన్సీ బాలాజీ






కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాము, వ్యవసాయ అధికారి మహేష్, కార్యదర్శి రఫీ,పోలీసులు, వివిధ శాఖల ఉప సర్పంచ్ గూగుల్ లోకి బుజ్జి, రైతులు సోమ్లా, సక్రు రాములు బిక్షం, జి నాగేశ్వరరావు సైదులు, బి రమేష్, సైదా,అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందిస్తాం

● మేడిగడ్డ పర్యటనలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ●పాల్గొన్న భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్

**(సాక్ష్యం) జయశంకర్ – భూపాలపల్లి, జూన్ 10 :** 2027 వరకు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మేడిగడ్డ ప్రాజెక్టు పునరుద్ధరణకై జరుగుతున్న పరీక్షల పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2014 కంటే ముందే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును 38వేల కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే దాదాపు 11 వేల కోట్ల రూపాయల పనులు పూర్తి కాగా దాదాపు 30 శాతం పని జరిగిందని తెలిపారు. 2014 తరువాత ఏర్పడిన ప్రభుత్వం కావాలనే ప్రాజెక్టు డిజైన్ మార్పు చేసి మేడిగడ్డ ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్లు



తెలిపారు. 16.50 లక్షలు ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు కావాలనే గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేయడం వల్ల ఇబ్బంది కలిగిందని, తప్పుడు నిర్ణయాలతో ప్రాజెక్టుకు కాలయాపన చేశారని తెలిపారు. దాదాపు 1,45,000 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ పనులు చేపట్టారని బ్యారేజీ లోపభూయిష్టమైన నిర్మాణం వల్ల కుంగుడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కుంగడానికి గల



కారణాలను లోతుగా విశేషణ చేసేందుకు సీడబ్ల్యూసీ, ఎన్డిఎస్ఏ వంటి ప్రతిష్టాత్మకమైన అనుభవం కలిగిన సంస్థలచే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. లోప భూయిష్టంగా నిర్మాణం ఉందని అంచనాలు తయారు చేశారని సాంకేతికంగా అత్యంత పకడ్బందీ పరీక్షలు నిర్వహించి ప్రాజెక్టు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు.

## పశువుల ఎరువుతోనే పంట దిగుబడులు

● రసాయన ఎరువులతో భూ సారానికి ముప్పు ● సేంద్రియాఎరువులతోనే భూమికి జీవం ● మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం

**రాయపర్తి, జూన్10(సాక్ష్యం):**

రోహిణి కార్తె వెళ్ళింది మృకశిరా కార్తె ప్రారంభమై మూడు రోజులైంది. ప్రస్తుతం ఖరీఫ్ పంటల కోసం రైతులు తమ వ్యవసాయ భూములను సిద్ధం చేస్తుండగా ఏడాదిగా పోగు చేసుకున్న పశువుల పేడ వ్యర్థాలను పొలాల్లో వేసుకుంటున్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా భూమి సారం పెరిగి దిగుబడి సైతం పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఒకరికి మించి మరొకరు అధికంగా రసాయన ఎరువుల వాడడంతో భూమి తన సహజ లక్ష ణాన్ని కోల్పోతుందని, దీంతో భూసారం లేకపోవడం తో పంట దిగుబడి దగ్గిపోతుందని వ్యవసాధికారులు అంటున్నారు. ఇందుకు విరుగుడుగా పశువుల ఎరువుతోనే భాసారాన్ని పెంచే అవకాశం ఉండడం తో రైతులు పశువుల ఎరువువైపే మొగ్గుచూపాలని రాయపర్తి ఏఓ వీరభద్రం అంటున్నారు. రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్ధాలపై అధికారులు, శాస్త్రవేత్తలు సైతం రైతులకు అవగాహన కార్యక్రమాలు అడపా దడప నిర్వహించడం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తే రైతులు సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచేందుకు ఆసక్తి చూప వచ్చని రైతులు అంటున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో వ్యవసాయ భూములకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పశువుల పేడ, వర్మీ కంపోస్టు, మేకల వ్యర్థాలు, పంట అవశేషాలు, జీవామృతం వంటి సహజ పదార్థాల తో తయారయ్యే ఎరువులు రైతన్నకు ఎంతో మేలు చేకూరుస్తాయి. నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం తో పాటు పంటలకు సహజ పోషకాలు అందిస్తాయి. సేంద్రియ ఎరువులు నేలలో సూక్ష్మజీవుల దీంతో పెరుగుదలకు దోహదపడతాయి. భూమిలోని సహజ సారం పంటలకు అనుకూలంగా మారుతుంది. గట్టి భూముల్లో నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం పెరుగుతోంది. తేమ శాతం పెంచడం వల్ల నీటి అవశ్యకత తగ్గుతుంది. భూమి మెత్తగా మారి గాలి, నీరు సులభంగా భూమి లోపలికి





వెళ్లే లా చేస్తుంది. గట్టి నేలలు పలుచగా మారుతాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు పంటల్లో నాణ్యత, పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రకృతి సిద్ధంగా లభించే నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు భూమికి మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేస్తాయి. వీటి వల్ల భూసారం పెరిగి మొక్కలు ఏపుగా పెరుగుతాయి. అధిక దిగుబడుల కోసం గత కొన్ని సంవత్స రాలుగా రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని పెంచుతూ వస్తున్నారు. వీటి ప్రభావంతో ప్రారంభంలో దిగుబడి బాగానే వచ్చినా.. క్రమంగా నేల సారం తగ్గడం, సాగు ఖర్చులు పెరగడం వంటి ప్రతికూల (ప్ర బ, ా వా ల ు క నివి న్న ంటాయి. యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల వల్ల పెట్టు బడులు పెరుగు తున్నాయి తప్ప దిగుబడులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

**పెంట మట్టితోనే భూమిలో బలం**

వ్యవసాయ భూముల్లో సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూమిలో సహజ పోషకాలు పెరిగి నేల సారవంతంగా మారుతుంది. పంట వ్యర్థాలను వేసవి దుక్కుల్లో కలియ దున్నడం, పశువుల



**పశువుల పేడ భూమి కి జీవం**
**– గుమ్మడి వీరభద్రం ఏఓ రాయపర్తి**

పశువుల పేడ (పెంట మంటి ) వలన భూమి కి జీవం



పోసినట్టు ఉంటది. రసాయన ఎరువుల వల్ల భూమిలోని సహజ సూక్ష్మజీవు లు తగ్గి సారం కోల్పోతుంది. తద్వారా ఏటా ఎరువుల వాడకం పెరుగుతుంది. మోతాదుకు మించి వాడుతుండటంతో నేల గట్టిపడుతుందని శాస్త్రవేత్త లు పేర్కొంటున్నారు. దీంతో రైతులు సేంద్రియ ఎరువులపై ఆసక్తి చూపుతున్నారు.

వ్యర్థాలను ఎరువులుగా వాడటం వల్ల పంటకు ఎంతో మేలు జరుగుతుంది. అధిక మోతాదులో రసాయన ఎరువుల వాడకంతో నేల గట్టి పడుతుంది. రైతుపై పెట్టుబడి భారం పెరుగుతుంది.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

– బాధితురాలికి న్యాయం

**మహబూబ్‌నగర్, జూన్ 10 ( సాక్ష్యం బ్యూరో )** మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహబూబ్‌నగర్‌లోని పోక్సో మరియు అత్యాచార కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. క్రైమ్ నెం. 509/2023కు సంబంధించి బాలికపై లైంగిక దాడికి పాల్పడిన గుర్రాల బాలయ్య ఏ బాలి పై విచారణ పూర్తి కాగా, ప్రత్యేక న్యాయస్థానం గౌరవ న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేకూర్చేందుకు దర్యాప్తు అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పటిష్టంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంతో నిందితుడికి శిక్ష పడేలా చేశారు. కేసు దర్యాప్తు నిర్వహించిన సి.ఐ. గాంధీ నాయక్, ఎ. వెంకటేశ్వర్లు, ఎస్ఐ, జి. విజయ్ కుమార్, ఎస్ఐ, ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. విజయ్ కుమార్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. జాన్, కోర్టు లైజన్ అధికారులు బాలకృష్ణ (ఏఎస్ఐ), కృష్ణయ్య (పీసీ), శంకర్ (పీసీ), రహీమ్ (పీసీ), అలాగే సీడీఓ అశోక్ రెడ్డి (పీసీ) సమన్వయంతో పనిచేసి కేసు కన్విక్షన్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి కేసు దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు సమర్థవంతంగా పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రత్యేక పబ్లిక్




ప్రాసిక్యూటర్, లైజన్ అధికారులను అభినందించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో
## అల్పాహార పంపిణీ అభినందనీయం: యస్ యస్ రావు

**కోదాడ జూన్ 10, (సాక్ష్యం)**

హైద్రాబాద్ లో సరూర్ నగర్ బీ ఎస్ ఎన్ ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పని చేస్తున్న సేకు మురళీ కృష్ణ లక్ష్మీ సునంద దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా, మురళీకృష్ణ జన్మ దినంను పురస్కరించుకొని బుధవారం కోదాడ లోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల కేంద్రంలోని పిల్లలకు అల్పాహార పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఎస్ఎస్ రావు అభినందించారు. మురళీకృష్ణ లక్ష్మీ



సునంద దంపతుల కు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు, మురళీ కృష్ణ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ వాసవి అమ్మవారి ఆశీస్సులు వారి కుటుంబానికి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ సభ్యులు సేకు రమేష్,సిబ్బంది పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

**– జిల్లా ప్రజా పరిషత్ యాదాద్రి భువనగిరి ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి శోభారాణి**

**చౌటుప్పల్ జూన్ 10 (సాక్ష్యం)**
గ్రామాల్లో ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయనిజిల్లా ప్రజా పరిషత్ యాదాద్రి భువనగిరి ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి శోభారాణి,చౌటుప్పల్ ఇన్చార్జి ఎంపీడీవో బి. విజయకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆరెగూడెం, కాట్రేవు, గుండ్ల బావి, పంతంగి, చిన్న కొండూరు, పెద్ద కొండూరు, మసీదు గూడెం, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో వారు పాల్గొని మాట్లాడుతూ.. ముందుగా 99 రోజుల కార్యాచరణ పనుల నివేదికను గ్రామసభలలో చదివి వినిపించారు.పచ్చదనం పారిశుధ్యంపై గ్రామాల్లో దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వస్తే పరిష్కారమవుతాయని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పైపులైన్లకు మరమ్మతులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి గ్రామంలోని కార్యదర్శులు తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు





చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్థుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అట్టడుగు వర్గాల ప్రజలకు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలువురు సర్పంచులు అన్నారు. గ్రామాలలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన సమస్యలు,రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై వినతిపత్రాలు పలు గ్రామాల సర్పంచులు వినతీ పత్రాలు సమర్పించారు. వారితో పాటు ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యల గురించి అధికారులకు తెలిపారు. అందిన వినతులను సంబంధిత అధికారుల ద్వారా వెంటనే పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ గ్రామ సభల్లో గ్రామాల సర్పంచులు ఆరెగూడెం గ్రామ సర్పంచ్ అన్న పల్లి ధనలక్ష్మి వెంకటరెడ్డి, చిన్న కొండూరు గ్రామ సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య, గుండ్ల బావి గ్రామ సర్పంచ్ నందగిరి వెంకటేష్, పెద్ద కొండూరు గ్రామ సర్పంచ్ గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్, పంతంగి గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్, మసీదు గూడెం గ్రామ సర్పంచ్ మర్రి వంశీధర్ రెడ్డి, కాట్రేవు గ్రామ సర్పంచ్ బోయ మహేంద్ర మనీ, ఎంపీఓ అంజిరెడ్డి, ఏపీవో ఈశ్వరయ్య, ఆర్డబ్ల్యుఏఈ విశాల్ రెడ్డి, ఏఈ పవన్ కళ్యాణ్, ఎస్సై రవీందర్, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

# పీపుల్ పహాడ్ గ్రామంలో బడిబాట కార్యక్రమం

**చౌటుప్పల్ జూన్ 10 (సాక్ష్యం)**
ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని పీపల్ పహాడ్ గ్రామంలో బుధవారం 'బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని







వారు కోరారు. బడిబాట కార్యక్రమానికి గ్రామ పాలకవర్గం అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు. గ్రామంలో క్రమం తప్పకుండా రోజూ బడిబాట కార్యక్రమం నిర్వహించటం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పులనాగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్, వార్డు సభ్యులు ఎర్ర సువర్ణ అంజయ్య, బద్దం సుధాకర్ రెడ్డి, ఎర్ర పూజా పరమేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఉమాదేవి, శ్రీదేవి, సురేష్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామ పరిధిలో ఉన్న కుంటలను, కట్టలను పరిశీలించిన ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి

**పాలకుర్తి జూన్ 10(సాక్ష్యం):**
పాలకుర్తి మండల కేంద్రములో ప్రభుత్వ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దుంపల సంపత్ మాట్లాడుతూ..సహజ వనరులు మానవ మనుగడలో ప్రత్యేక పాత్ర పోషిస్తాయని భూగర్భజలాల నిల్వల కోసం వందల సంవత్సరాల క్రితమే గొలుసు కట్టు చెరువులను, కుంటలు నిర్మించడం జరిగింది. అధికారుల నిర్వహణ లోపం వలన వాటి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని నేడు వాటి హద్దులను చెరిపివేసే ప్రయత్నం జరుగుతుందని వాటిని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరి పైన ఉందని కుంటాలలో నీటి నిల్వల వలన భూగర్భ జలాల నీటి సాంద్రత పెరిగి బోర్లు, బావిలో నీరు పెరిగి





పంట పొలాలకు సాగునీరు పెరిగే అవకాశం ఉందన్నారు కావున ప్రతి ఒక్క రైతులు, ప్రజలు, సామాజిక కార్యకర్తలు కుంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కుంట కట్టాలను, మత్తడి, తూము ధ్వంసం చేసిన ప్రాంతలను గుర్తుంచి..ఎవరైనా కుంటలలో పనిచేసే యాత్రల పై సమాచారం అందిస్తే తగిన నగదు బహుమతి ఇస్తామని అన్నారు.కుంట నిర్మాణాలను ధ్వంసం చేసిన వారి సమాచారం రెవిన్యూ, పోలీస్ అదికారుల దృష్టికి తీసుకుపోతామని అన్నారు.ఈ కార్యక్రమం లో సమితి కార్యదర్శి జీడీ సమ్మయ్య, ముదిరాజ్ సంఘము రాష్ట్ర నాయకులు దాసరి మధు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

## దేవుడి మాన్యాల కౌలు భూముల బహిరంగ వేలం



**కోదాడ, జూన్ 10 (సాక్ష్యం)**
శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వ్యవసాయ భూముల కౌలు బహిరంగ వేలం పాటను బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామ దేవాలయ ప్రాంగణంలో 2026-27 సంవత్సరమునకు కౌలు గ్రామ పెద్దలు, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలంపాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో కౌలు రైతులు రూ.8.11 లక్షలకు కౌలు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ కార్య నిర్వహణ అధికారి తుమ్మల వెంకట చలపతి, గ్రామ రైతులు, గ్రామపెద్దలు, భక్తులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ 12 ఏండ్ల పాలన విజయవంతమైన సందర్భంగా సోమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

**పాలకుర్తి జూన్ 10 (సాక్ష్యం):**
భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, ప్రపంచ దేశాల ముందు అగ్రగామిగా నిలిపిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి మండల అధ్యక్షుడు మారం రవికుమార్ మాట్లాడుతు స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అఖండ భారతదేశ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ మరిన్ని ఏండ్ల పాటు దేశానికి సేవలందించేలా.ఆయురారోగ్యాలను ప్రసాదించాలని లక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. గడిచిన 12 ఏండ్లలో పేదల సంక్షేమం, అంతర్జాతీయంగా దేశ గౌరవాన్ని పెంచడం, మౌలిక వసతుల కల్పనలో మోడీ గారి పాలన ఒక సువర్ణలి అధ్యాయమని కొనియాడారు. ఆయన బలమైన నాయకత్వంలో దేశం మరింత ముందుకు సాగాలనిలి



ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కడుదుల నిరంజన్, మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, ఉపసర్పంచ్ ఈర్ల రాజు, సీనియర్ నాయకులు మచ్చ సునీల్, వేమునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ మండల విద్యా వనరుల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ విజయ కుమారి

**– పాఠ్యపుస్తకాల పంపిణీ, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశం**

**మహబూబ్‌నగర్, జూన్ 10 (సాక్ష్యంబ్యూరో):**
మహబూబ్‌నగర్ అర్బన్ మండల విద్యా వనరుల కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలకు కేంద్రాన్ని సందర్శించిన ఆమె అక్కడ నిర్వహిస్తున్న రికార్డులు, విద్యా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రోగ్రెసివ్ యాక్టివిటీకి సంబంధించిన పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించి, వాటిని రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 15 నాటికి ప్రతి విద్యార్థికి



పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని అర్బన్ ఎంఈఓ లక్ష్మణ్ సింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు కె. శ్రీనివాసులు, వరలక్ష్మి, మొగులయ్య, గీతారాణి, కైసర్ జేబిన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

# జూలై 5న రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలి

**– టీఆర్పి పార్టీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కడతాల యాదగిరి**

**చౌటుప్పల్ జూన్ 10 (సాక్ష్యం)** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న నిర్వహించ తలపెట్టిన రాజ్యాధికార సమరభేరి భారీ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఆ పార్టీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు



కడతాల యాదగిరి పిలుపునిచ్చారు.బుధవారం చౌటుప్పల్ మండల కేంద్రం లోనీ కళాశ్రీ ఫంక్షన్ హాల్ లో పార్టీ ముఖ్య నేతల కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నరసయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మండల పార్టీ అధ్యక్షుడు కడపల యాదగిరి శాలువాతో ఘనంగా సన్మానించారు అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ఉన్నా గ్రామ పంచాయతీ లు,మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల్లోని బీసీ కుల సంఘాల నాయకులకు ఆహ్వాన పత్రికను తెలియజేశారు. జూలై 5న ప్రతి బీసీ కుల బాంధవుడు ఈ సమరభేరి సభకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కొమిరిశెట్టి నరసయ్య , చౌటుప్పల్ జనరల్ సెక్రటరీ అరూరి శివ, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలో అదనపు వసతుల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని

**పాలకుర్తి జూన్ 10 (సాక్ష్యం):**
పాలకుర్తి మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలో అదనపు వసతుల నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి విద్యార్థినుల విద్యాభివృద్ధి,మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా చేపట్టిన ఈ పనులను అధికారులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో అదనపు వసతుల కోసం రూ.38.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపి విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని,పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు



మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు పడాలని,ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మేడారం పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

**– భక్తులకు శాశ్వత సౌకర్యాలను కల్పించాలి – పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**తాడ్వాయి, జూన్ 10, (సాక్ష్యం) :** తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తి భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మేడారం అభివృద్ధి పనుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం మహాజాతర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని, జాతర సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జంపన్నవాగు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకల మార్గాలను నిరంతరం పరిశీలిస్తూ, ఆలయ ప్రాంగణంలో భద్రత, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో శాశ్వత నిర్వహణ వ్యవస్థ ఉండేలా అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక మెయింటెనెన్స్ కమిటీని ఏర్పాటు చేయాలని, కమిటీ నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. భక్తుల నుంచి వచ్చే సమస్యలకు వెంటనే స్పందించే విధంగా సమన్వయ వ్యవస్థ రూపొందించాలని సూచించారు.సమ్మక్క-సారలమ్మ ఆలయానికి గోదావరి పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున ముందస్తుగా మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. శాశ్వత స్నాన ఘట్టాలు, విశ్రాంతి గదులు, ఇతర సౌకర్యాలను దశల వారీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జంపన్నవాగు ప్రాంతాన్ని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, వనదేవతల ఆలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మేడారం జాతర సమయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



చూడాలని సూచించారు.శాశ్వత ప్రాతిపదికన 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.వరదల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, గ్రామాల్లోని కుంటలు, చెరువులు, కరకట్టల పరిస్థితిని అంచనా వేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి వన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై
# అడుగుపెట్టనున్న టీమిండియా..

భారత క్రికెట్ అభిమానులకు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీమిండియా సుదీర్ఘ విరామం తర్వాత పొరుగు దేశమైన శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 9 సంవత్సరాల తర్వాత భారత జట్టు లంక గడ్డపై వైట్ జెర్సీతో బరిలోకి దిగబోతుండటం విశేషం.

చివరిసారిగా 2017లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడింది. అప్పట్లో లంకను వారి సొంత గడ్డపైనే క్లీన్ స్వీప్ చేసి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత టీమిండియా అక్కడ అడుగుపెడుతుండటంతో ఈ టూర్ ఫుల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. భారత్, శ్రీలంక మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆగస్టు 15న ఘనంగా ప్రారంభం కానుంది. సరిగ్గా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు జరుగుతుంది. ఆ తర్వాత కొద్దిరోజుల గ్యాప్‌తో ఆగస్టు 23 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, ఈ రెండో మ్యాచ్ జరగబోయే వేదికపై లంక బోర్డు ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, సెంట్రల్ కొలంబోలోని ప్రసిద్ధ సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.శ్రీలంకతో జరగబోయే ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కేవలం ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు. ఇది ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగబోతోంది. కాబట్టి ఫైనల్ రేసులో నిలవాలంటే రెండు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఇప్పటివరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి కానీ ఈ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. కానీ అంతర్గత సమాచారం ప్రకారం ఈ తేదీలు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడబోతుండటం గమనార్హం. ఈ పర్యటనలో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, అభిమానులను అలరించడానికి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా హింట్ ఇచ్చారు. లంక బోర్డు నుంచి అదనంగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సిందిగా తమకు అభ్యర్థన వచ్చిందని ఆయన మీడియాకు వెల్లడించారు. దీనిపై బీసీసీఐ సానుకూలంగానే ఉందని, త్వరలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలతో కూడిన పూర్తి అధికారిక షెడ్యూల్‌ను ఇరు దేశాల బోర్డులు సంయుక్తంగా విడుదల చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియాకు ఘోర పరాజయం
## తొలి వన్డేలో 86 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ విక్టరీ

ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు బంగ్లాదేశ్ షాక్ ఇచ్చింది. మొసద్దిక్ హొస్సేన్ (86)



రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 284 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 191/9 వద్ద ఉన్నప్పుడు వర్షం పడటంతో, డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం బంగ్లాదేశ్ 86 పరుగుల తేడాతో గెలిచింది. నహిద్ రాణా 4 వికెట్లు తీశాడు. కాగా, వన్డేల్లో ఆసీస్‌పై బంగ్లాదేశ్‌కు 21 ఏళ్ల తర్వాత (చివరిగా 2005లో) ఇదే తొలి విజయం. వన్డే ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచులో చిత్తుగా ఓడిపోయింది. ప్రపంచ ఛాంపియన్ అయిన ఆసీస్.. చిన్న జట్టు బంగ్లాదేశ్ చేతిలో పరాజయం చవిచూసింది. 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్.. ఆస్ట్రేలియాను వన్డేల్లో ఓడించింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బంగ్లాదేశ్.. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది.3 వన్డేలు, 3 టీ20 మ్యాచులు ఆడేందుకు ఆస్ట్రేలియా జట్టు బంగ్లాదేశ్ గడ్డపై అడుగుపెట్టింది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ బంగళవారం ఢాకాలో జరిగింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు స్కోరు చేసింది. మొసద్దిక్ హొస్సేన్ 70 బంతుల్లో 86 రన్స్ చేశాడు. ఛేజింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియాకు తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనింగ్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔట్ అయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లోనే మార్నస్ లబుషేన్ (1) కూడా వెనుదిరిగాడు. కూపర్ కన్నోలీ (35), జోష్ ఇంగ్లిస్ (19) కూడా భారీ స్కోరు చేయలేకపోయారు. 47 రన్స్ చేశాక అలెక్స్ కేరీ కూడా ఔట్ కావడంతో ఆస్ట్రేలియా ఓటమి దాదాపుగా ఖరారైపోయింది. అయితే జట్టు స్కోరు 42.2 ఓవర్లలో 191/9 వద్ద ఉండగా.. వర్షం అంతరాయం కలిగించింది. ఎంతకూ వాన తగ్గకపోవడంతో డక్ వర్త్ లూయిస్ ప్రకారం బంగ్లాదేశ్.. 86 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు అంపైర్లు ప్రకటించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిద్ రాణా.. 4 వికెట్లతో సత్తాచాటాడు. ముస్తాఫిజుర్ రెహ్మాన్ 2, మొసద్దిక్ హొస్సేన్ 2, తస్కిన్ అహ్మద్ 1 వికెట్ తీశారు. కాగా బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియా 21 ఏళ్ల తర్వాత వన్డే మ్యాచులో ఓడిపోయింది. బంగ్లాదేశ్ 2005లో రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆసీస్‌ను ఓడించింది.

# పసికూన చేతిలో ఘోరంగా ఓడిన పాకిస్తాన్..

ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్-2026 ప్రధాన టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ మహిళల జట్టుకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మంగళవారం డెర్బీలోని కౌంటీ గ్రౌండ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన తన రెండవ, చివరి వార్మప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 41 పరుగుల తేడాతో (డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం) పరాజయం పాలైంది. వర్షం కారణంగా నిలిచిపోయిన ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ అద్భుత ప్రదర్శనతో పాక్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట స్కాట్లాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్కాట్లాండ్ ఓపెనర్ డార్సీ కార్టర్ (36 బంతుల్లో 45 పరుగులు) జట్టుకు బలమైన ఇన్నింగ్స్ అందించింది. ఆమె మరో ఓపెనర్ కేథరిన్ ఫ్రేజర్ (19)తో కలిసి మొదటి వికెట్‌కు 6 ఓవర్లలోనే 41 పరుగులు జోడించింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్కాట్లాండ్ కెప్టెన్ కేథరిన్ బ్రైస్ మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించింది. కేవలం 43 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి తృప్తిగా సెంచరీ చేజార్చుకుంది. ఆమె మెరుపు ఇన్నింగ్స్ కారణంగా స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 191 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బౌలర్లు క్రమంగా వికెట్లు తీసినప్పటికీ, ఫీల్డర్ల పేలవమైన ప్రదర్శన కారణంగా బ్రైస్‌ను అడ్డుకోలేకపోయారు. ఇన్నింగ్స్ చివరి బంతికి ఆమె రనౌట్ అయింది. 192 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ మహిళల జట్టు ఆరంభంలోనే చేతులెత్తేసింది. మొదటి ఐదు ఓవర్లలోనే గుల్ ఫెరోజా, సైరా జబీన్, ఆయేషా జాఫర్ వంటి కీలక వికెట్లను కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. స్కాట్లాండ్ బౌలర్ రాచెల్ స్లేటర్ తన రెండు ఓవర్లలోనే రెండు వికెట్లు తీసి పాక్‌ను



కోలుకోలేని దెబ్బతీసింది. 9 ఓవర్లు ముగిసేసరికి పాకిస్తాన్ 62 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ దశలో హఠాత్తుగా కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేసి, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం స్కాట్లాండ్‌ను 41 పరుగుల తేడాతో విజేతగా ప్రకటించారు.తమ మొదటి వార్మప్ మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో 9 వికెట్ల తేడాతో ఓడిపోయిన పాకిస్తాన్‌కు, ఇది వరుసగా రెండవ పరాజయం. ఈ ఆదివారం (జూన్ 14న) ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సాంప్రదాయ ప్రత్యర్థి భారత్‌తో జరగబోయే తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ మ్యాచ్‌కు ముందు ఈ వరుస ఓటములు పాక్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. మరోవైపు, ఉత్సాహంలో ఉన్న స్కాట్లాండ్ జట్టు జూన్ 13న ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఐర్లాండ్‌తో తలపడనుంది. ఈ ప్రపంచకప్ టోర్నీలో గ్రూప్-ఎ లో భారత్, పాకిస్తాన్‌లతో పాటు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బి లో ఆతిథ్య ఇంగ్లాండ్, డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజీలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, స్కాట్లాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. కాగా, ఈ మెగా టోర్నమెంట్ శుక్రవారం బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్-శ్రీలంక మ్యాచ్‌తో అధికారికంగా ప్రారంభం కానుంది.

# ఒలింపిక్స్‌లో కోహ్లీని ఆడించాలి..
## టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లీని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లీ క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు.128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది.తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. ‘మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లీ తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు.విరాట్ కోహ్లీకి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను’అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం అంతర్జాతీయ టీ20లకు విరాట్ కోహ్లీ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభశ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా వైభవ్ సత్తా చాటితే ఒలింపిక్స్ జట్టులో ఉంటాడు. 1900 సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్‌లను కూడా చేర్చారు.





ఒలింపిక్స్‌లో కోహ్లీని ఆడించాలి..
టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లీని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లీ క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు.128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది.తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. ‘మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లీ తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు.విరాట్ కోహ్లీకి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను’అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం అంతర్జాతీయ టీ20లకు విరాట్ కోహ్లీ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభశ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా వైభవ్ సత్తా చాటితే ఒలింపిక్స్ జట్టులో ఉంటాడు. 1900 సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్‌లను కూడా చేర్చారు.

# మైదానంలో తీవ్ర వాగ్వాదం

ఢాకా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా, ఆసీస్ కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఇంగ్లిస్ (19) వికెట్ తీసిన రాణా, అతని ముందే రెచ్చగొట్టేలా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. అదే సమయంలో ఏదో అనడంతో ఇంగ్లిస్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ వెనక్కి తిరిగి గొడవకు దిగిన ఇంగ్లిస్‌ను బంగ్లాదేశ్ ఆటగాళ్లు సముదాయించి పంపించారు.బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా మధ్య ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ఓ ఆసక్తికర ఘటన జరిగింది. ఈ మ్యాచులో



బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా , ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో జోష్ ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత వివాదం చెలరేగింది. నహిద్ రాణా సెలబ్రేషన్స్ ఇంగ్లిస్‌కు కోపం తెప్పించాయి. దీంతో మైదానంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు బంగ్లాదేశ్ ప్లేయర్లు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. 284/8 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తొలి 8 బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. ఆదుకునే ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్.. 51/2తో నిలిచింది. అప్పటికే ఇంగ్లిస్ 19 రన్స్ చేశాడు. అయితే 11వ ఓవర్ వేసేందుకు నహిద్ రాణా వచ్చాడు. స్ట్రైకింగ్‌లో ఇంగ్లిస్ ఉన్నాడు. రాణా వేసిన బంతిని షాట్ ఆడబోయిన ఇంగ్లిస్.. వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. బ్యాట్ బంతిని తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ చేతిలో పడటంతో ఔట్ అయ్యాడు. దీంతో నహిద్.. సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇంగ్లిస్ ముందే తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత నహిద్.. ఏదో అనగా ఇంగ్లిస్ కోపోద్రిక్తుడైపోయాడు. పెవిలియన్‌కు వెళ్లిపోతున్న అతడు.. వెనక్కి తిరిగి గొడవకు దిగాడు. కానీ అక్కడే ఉన్న బంగ్లాదేశ్ ప్లేయర్లు.. జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇంగ్లిస్ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మ్యాచులో ఆస్ట్రేలియా 86 పరుగుల(డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) తేడాతో పరాజయం పాలైంది. దీంతో బంగ్లాదేశ్ చేతిలో 21 ఏళ్ల తర్వాత వన్డే మ్యాచులో ఓడిపోయింది. 2005లో రికీ పాంటింగ్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు సైతం బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోయింది.

# కమీషన్ దొబ్బుతూనే విమర్శలా?
## సునీల్ గవాస్కర్ ఆగ్రహం

ఐపీఎల్ టోర్నీపై విమర్శలు గుప్పిస్తున్న విదేశీ మాజీ క్రికెటర్లు, క్రికెట్ బోర్డులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీసీఐ నుంచి 10 శాతం కమీషన్ దొబ్బుతూనే టోర్నీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తమ ప్రయోజనాల కోసం భారత క్రికెట్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఆయన హితవు పలికారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పూర్తి స్థాయిలో ఆడిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ కంటే ఐపీఎల్ వంటి లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు మాజీ క్రికెటర్లు ఆర్చర్‌పై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ టోర్నీని తప్పుబట్టారు.ఫ్రాంచైజీ లీగ్స్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముప్పు పొంచి



ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. ‘టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచివే. కానీ అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కంటే వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుంది’అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ సైమన్ డౌల్ సైతం ఆర్చర్ తీరును తప్పుబట్టాడు. డబ్బుల కోసం దేశం తరఫున జరిగే మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం సరికాదని విమర్శించాడు. గతంలో ట్రెంట్ బౌల్ట్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సమయాల్లోనూ టెస్ట్‌ల కోసం సిద్ధమయ్యేవారని గుర్తు చేశాడు. ఈ మాజీ ఆటగాళ్ల విమర్శలను సునీల్ గవాస్కర్ ఖండించారు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించడం కొందరు విదేశీ ఆటగాళ్లకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు ఇచ్చే వేతనంలో 10 శాతం వాటాను బీసీసీఐ నేరుగా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు చెల్లిస్తోందని ఆయన గుర్తు చేశారు.ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లీగ్‌లు ఇలాంటి పద్ధతిని పాటించడం లేదని ఆయన ఎత్తిచూపారు. మిలియన్ల పౌండ్లను బీసీసీఐ నుంచి పొందుతున్న బోర్డులే..ఇప్పుడు ఐపీఎల్‌ను తక్కువ చేసి మాట్లాడటం వారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనమని గవాస్కర్ మండిపడ్డారు. ‘భారత క్రికెట్, ఇక్కడి అభిమానుల సొమ్ముతో విదేశీ బోర్డులు తమ ఖజానాను నింపుకుంటున్నాయి. ఆ విషయాన్ని మరిచిపోయి ఐపీఎల్‌ను ద్వేషించడం విడ్డూరంగా ఉంది. భారత క్రికెట్‌ను ఎంతగా తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసినా..ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికైనా విమర్శకులు వాస్తవాలను గుర్తించాలి.’అని గవాస్కర్ చురకలంటించారు.



## గే , ట్రాన్స్ జెండర్స్ పై వివక్ష తొలగాలని, వారి హక్కులను కాపాడాలని చెప్పే చిత్రమే “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ “

### దర్శక నిర్మాత పి. సునీల్ కుమార్ రెడ్డి

సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా “ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్“. ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్హోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా , చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. “ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్“ సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ మూవీ టీమ్ మీడియాతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ – మా హక్కుల కోసం ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నాము. కానీ మాకు సరైన వేదిక ఎక్కడా లభించలేదు. డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి గారు మా సమస్యల ఇతివృత్తంతో ఈ సినిమాను రూపొందించడం హ్యాపీగా ఉంది. మేము నటులము కాము. కానీ మా జీవితంలో మేము ఎలా ఉంటామో అలాంటి పాత్రలనే డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి గారు ఈ చిత్రంలో తెరకెక్కించారు. మేము ఈ సినిమాలో మా నిజ జీవిత పాత్రలనే పోషించాం. ఈ సినిమా ద్వారా మేము సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నాం. అన్నారు. గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ – గే కమ్యూనిటీ కోసం దాదాపు 12 ఏళ్లుగా పోరాడుతున్నాను. మన సినిమాల్లో గే క్యారెక్టర్స్ ను కామెడీ కోసం ఉపయోగించడం చూశాం. కానీ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్ కు వచ్చే అనేక చిత్రాల్లో ఎంతో డెప్త్ గా గే కమ్యూనిటీ సమస్యలను తెరకెక్కించడం నేను గమనించాను. ఇతర రాష్ట్రాల్లో గే లైఫ్ మీద ఇన్ డెప్త్ మూవీస్ సీరియస్ అప్రోచ్ తో వచ్చాయి. ఆ సినిమాల వల్ల అక్కడి సమాజం గే కమ్యూనిటీని చూసే విధానం మారిపోయింది. తెలుగులో ఫస్ట్ టైమ్ అలాంటి ప్రయత్నం డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి గారు చేస్తున్నారు. ఆయన మాతో ట్రావెల్ చేసి మా జీవితాన్ని దగ్గరగా గమనించారు. ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు మీ సపోర్ట్ దక్కాలి. ఈ చిత్రంతో మా జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశిస్తున్నాము. అన్నారు. ట్రాన్స్ జెండర్ సోషల్ మీడియా యాక్టివిస్ట్ సనా ఖాన్ మాట్లాడుతూ – మా జీవితాలు ఎలా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. బయట ప్రపంచం చూడని మా జీవిత ప్రయాణాన్ని, మా సమస్యలు, భావోద్వేగాలను ఈ చిత్రంలో దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డిగారు చూపించారు. మేము ఏంటి అనేది కాకుండా మా ప్రతిభ అందరికీ తెలియాలి. ఇంకా మాకు మరిన్ని అవకాశాలు దక్కాలని కోరుకుంటున్నాం. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం. అన్నారు. ట్రాన్స్ జెంటర్ ఇన్ స్టాగ్రామ్ యాక్టివిస్ట్ హీరోయిన్ హిమ రాథోడ్ మాట్లాడుతూ – ఈ మూవీతో మమ్మల్ని సమాజం చూసే తీరు మారుతుందని, మా మీద అందరిలో ఉన్న అపోహలు తొలగిపోతాయని ఆశిస్తున్నాను. మేము మా జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను నా పాత్ర ద్వారా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు చూపించారు. ఈ చిత్రంలో ఎంతోమంది పేరున్న ఆర్టిస్టులతో కలిసి నటించడం మర్చిపోలేను. అన్నారు. డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ – సమానత్వం ఉందని చెప్పుకునే మన దేశంలో ట్రాన్స్ జెండర్స్ విషయంలో తీవ్రమైన వివక్ష ఎదురవుతోంది. ట్రాన్స్ జెండర్స్ మీద ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. కానీ అవి పోలీస్ స్టేషన్స్ లో కేసులుగా నమోదు కావడం లేదు. కోర్టుల దాకా వెళ్లి జడ్జిమెంట్ పొంది శిక్షలు పడటం లేదు. ఇప్పటిదాకా ఒక్క ట్రాన్స్ జెండర్ కేసు కూడా ఏ కోర్టులోనూ తుది తీర్పు వచ్చి శిక్ష పడలేదు. ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదు. ఫస్ట్ టైమ్ మన సినిమాలోనే ఒక ట్రాన్స్ జెండర్ కేసులో పూర్తి న్యాయం జరిగినట్లు చూపిస్తున్నాం. ఈ సినిమాలో ఎంటర్ టైన్ మెంట్ ఉంటుంది, అలాగే సీరియస్ ఇష్యూస్ చెబుతున్నాం. కేవలం మల్టిప్లెక్స్ లో మాత్రమే ఈ నెల 19న మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. మీ ఆదరణ ఉంటే సింగిల్ స్క్రీన్స్ లోనూ రిలీజ్ చేస్తాం. తెలుగు వెర్షన్ లో ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో సినిమా ఉంటుంది. ఒక కొత్త తరహా కంటెంట్ చూడాలనుకునే ప్రేక్షకులు మా సినిమాకు రావొచ్చు. పుణెలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో మా సినిమాకు బెస్ట్ ఫిలిం అవార్డ్ దక్కింది. ఫిలిం ఫెస్టివల్స్ కు మాత్రమే ఇలాంటి సినిమాలు పరిమితం కావొద్దు. జనాల మధ్యలో డిస్కషన్ కు రావాలి అనేది మా ఉద్దేశం. గే అండ్ ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ గురించి నేను చేసిన చిత్రమిది. సెన్సార్ విషయంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అన్నారు.

## యశ్ రాజ్ ఫిల్మ్స్, ఆలియా భట్ ‘ఆల్ఫా’ టీజర్ రిలీజ్..

### జూలై 3న వరల్డ్ వైడ్‌గా మూవీ గ్రాండ్ రిలీజ్

ఆలియా భట్ ప్రధాన పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ ‘ఆల్ఫా’. బుధవారం (జూన్ 10) మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆలియా భట్ ఓ హంతకురాలి పాత్రలో నటించింది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న ఆల్ఫా చిత్రాన్ని ..చిన్న వయస్సు నుంచే పెంచి, హత్యలు చేయడానికి తయారు చేసిన ఓ హంతకురాలుకి సంబంధించిన మూల కథతో రూపొందించారు. టీజర్‌ను గమనిస్తే.. బాబీ డియోల్ తండ్రి పాత్రలో కనిపించారు. తన కుమార్తెను బాబీ చిన్నప్పటి నుంచే హత్యలు చేసే ఓ హంతురాలిగా పెంచి పెద్ద చేస్తాడని అర్థమవ ుతుంది. అలాగే ఆమె చేసిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా మనం ఇందులో గమనించవచ్చు. త్వరలోనే ఈ సినిమాలో మరో ప్రధాన పాత్రలో నటించిన శర్వారి పాత్రను మేకర్స్ పరిచయం చేయబోతున్నారు. ఆల్ఫా స్వభావాన్ని అలవరుచుకున్న ఇద్దరమ్మాయిల కథతో తెరకెక్కిన పాప్‌కార్న్ సినిమా. ఇద్దరు హీరోయిన్స్ ప్రధాన పాత్రధారులుగా ఇప్పటి వరకు యాక్షన్ సన్నివేశాలతో రూపొందింది. థ్రిల్లింగ్, ఎమోషనల్, ఫన్నీ ఎలిమెంట్స్‌తో ఎవరూ ఊహించని మలుపులతో రైడింగ్‌లా ఆల్ఫా సినిమాను రూపొందించారు. ‘ఆల్ఫా’ మూవీని గ్లోబల్ హిట్ సిరీస్ రైల్వే మెన్ ఫేమ్ శివ్ రవాలి తెరకెక్కిస్తున్నారు. బాబీ డియోల్, అనీల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూలై 3న ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది.



## వరలక్ష్మి శరత్‌కుమార్ వల్ల ‘పోలీస్ కంప్లైంట్’ చిత్రానికి భారీ నష్టం: దర్శకుడు సంజీవ్ మేగోటి

- అగ్రిమెంట్ ఉల్లంఘించి ప్రమోషన్స్‌కు దూరం
- సినిమా కాన్సెప్ట్ మాదిరిగానే కర్మ ఆమెను వదిలి పెట్టదు
- దర్శకుడు సంజీవ్ మేగోటి సంచలన వ్యాఖ్యలు
- ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్
- జూన్ 12న తెలుగు, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల

హారర్, యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, రొమాన్స్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ‘పోలీస్ కంప్లైంట్’ చిత్రం జూన్ 12న తెలుగు, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మాణంలో, క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్స్‌కు సహకరించకపోవడం వల్ల తమ చిత్రానికి భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. “ఇది నేను దర్శకత్వం వహించిన 11వ చిత్రం. నా కథను నమ్మి సినిమా నిర్మించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. 52 మంది సీనియర్ కళాకారులతో కేవలం 45 రోజుల్లో చిత్రాన్ని పూర్తి చేశాం. ‘చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ’ అనే వినూత్న కాన్సెప్ట్ చుట్టూ కథ తిరుగుతుంది. హారర్ థ్రిల్లర్ అంశాలతో పాటు యాక్షన్, ఎమోషన్‌లను సమపాళ్లలో మేళవించాం. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన వరలక్ష్మి శరత్‌కుమార్‌కు కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర లభించింది. ఆమె సౌకర్యం కోసం మేము అన్ని విధాలా సహకరించాం. కానీ డబ్బింగ్‌కు కూడా సరిగా అందుబాటులో లేకపోవడం మాకు ఇబ్బందులు కలిగించింది.



అగ్రిమెంట్ ప్రకారం ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ స్పందించలేదు. కేవలం గంటసేపు ప్రమోషన్ కార్యక్రమానికి రావాలని కోరినా రాలేదు. డబ్బులు తీసుకున్న తర్వాత ఇలా వ్యవహరించడం బాధాకరం. దీని వల్ల మా చిత్రానికి భారీ నష్టం జరిగింది. మా సినిమా కాన్సెప్ట్ ‘చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ’ మాదిరిగానే కర్మ ఎవరినీ వదిలిపెట్టదు” అని అన్నారు హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన ‘పోలీస్ కంప్లైంట్’ చిత్ర ట్రైలర్, పాటలు ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా ‘చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ’ కాన్సెప్ట్ చుట్టూ తిరిగే కథపై ఆసక్తి నెలకొంది. జూన్ 12న విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంత మేర ఆకట్టుకుంటుందో చూడాలి.

## కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

### రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.






## #NBK111 నుంచి బాలయ్య బర్త్ డే సందర్భంగా కింగ్ ఆఫ్ కేయాస్ 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' గ్లింప్స్ రిలీజ్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని భారీ కాన్వాస్‌పై రూపుదిద్దుకుంటున్న #NBK111 చిత్రం కోసం మళ్ళీ జతకట్టారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, హై-వోల్టేజ్ యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామా. ఈ స్టార్-డైరెక్టర్ కాంబినేషన్ నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే ట్రేడ్‌మార్క్ మాస్ మూమెంట్స్ తో సినిమా అద్భుతంగా అలరించబోతోంది. బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, చిత్ర నిర్మాతలు 'ఎంట్రీ ఆఫ్ ఆన్ ఎరా' పేరుతో ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. బాలకృష్ణ పాత్రను పరిచయం చేసేలా ఈ గ్లింప్స్‌ను రూపొందించారు. 1993 బాంబే అల్లకల్లోల పరిస్థితుల నేపథ్యంలో సాగే ఈ వీడియోలో డార్క్, హింసతో నిండిన ప్రపంచాన్ని చూపించారు. అలాంటి పరిస్థితుల్లో స్టైల్, ఇంటెన్స్, పవర్ కు ప్రతీకగా బాలకృష్ణ ఎంట్రీ అదిరిపోయింది. డైలాగ్స్ లేకుండానే విజువల్స్ ద్వారా పాత్ర పవర్‌ను అద్భుతంగా చూపించారు. దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ సాగాగా మలిచారు. భారీ యంత్రాలు, అగ్నిజ్వాలలు, ప్రాణాంతక ఆయుధాలు, విధ్వంసకర యాక్షన్ ఎపిసోడ్స్‌తో గ్లింప్స్ అంతా ఉత్కంఠభరితంగా సాగింది. ప్రతి ఫ్రేమ్ హీరో పాత్ర స్థాయిని మరింత ఎలివేట్ చేసేలా రూపొందించారు. ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్రను ‘కింగ్ ఆఫ్ కేయాస్’గా ప్రజెంట్ చేశారు. ఈ గ్లింప్స్ బాలకృష్ణ ఆదరగొట్టేశారు. సరికొత్త మేకోవర్‌లో ఆయన ఎంతో స్టైలిష్‌గా, ఎనర్జిటిక్‌గా, అత్యంత పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత ఇంపాక్ట్ ఫుల్ గా నిలబెట్టింది. డీవోపీ అరవింద్ ఎస్. కశ్యప్ తన కెమెరా పనితనంతో చిత్రానికి రగ్డ్, స్టైలిష్ విజువల్ టెక్స్చర్‌ను అందించారు. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు మరింత ఊపునిచ్చింది. సినిమా స్థాయి, నిర్మాణ విలువలు చాలా గ్రాండ్‌గా కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. సాయి మాధవ్ బుర్ర సంభాషణలు అందిస్తుండగా, రామ్-లక్ష్మణ్, రవివర్మ, వెంకట్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేస్తున్నారు. ‘ఎంట్రీ ఆఫ్ యాన్ ఎరా’ గ్లింప్స్ తో #NBK111 పై అంచనాలు భారీగా పెరిగాయి.

## సింగీతం శ్రీనివాసరావు-నాగ్ అశ్విన్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'సింగ్ గీతం' విడుదల తేదీలో ఒక రోజు మార్పు

### జూన్ 12న రిలీజ్– సెన్సార్ పూర్తి– క్లీన్ ‘యూ’ సర్టిఫికేట్ ఇచ్చిన సెన్సార్ బోర్డ్

చాలా మంది ఫిల్మ్ మేకర్స్ సినిమా విడుదల అనేది ఒక ముగింపు ఘట్టం. అయితే లెజెండరీ దర్శకుడు సింగీతం



శ్రీనివాసరావు, క్రియేటివ్ ఫిల్మ్‌మేకర్ నాగ్ అశ్విన్ లకు మాత్రం తాము ఊహించిన ప్రతి క్రియేటివ్ ఎలిమెంట్ తెరపై అత్యుత్తమంగా ఆవిష్కృతమయ్యేలా చూసుకోవడమే ముఖ్యం. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘సింగ్ గీతం’ చిత్రం తొలుత జూన్ 11న విడుదల కావాల్సి ఉండగా, ఇప్పుడు జూన్ 12కి వాయిదా పడింది. కథలో కీలక పాత్ర పోషించే కొన్ని ముఖ్యమైన సీజీఐ, విజువల్ ఎఫెక్ట్స్ పనులను మరింత మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ‘సింగ్ గీతం’ ఒక ఫాంటసీ, సూపర్‌నేచురల్ ప్రపంచాన్ని ఆవిష్కరించే చిత్రం. ఇందులో సంగీతంతో పాటు విజువల్స్ కూడా కథనంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ప్రేక్షకులను ఆ ప్రపంచంలో పూర్తిగా లీనం చేసే అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో, చిత్ర బృందం ఫైనల్ అవుట్‌పుట్‌ను మరింత పర్ఫెక్ట్ చేయడానికి అదనపు సమయం కేటాయిస్తోంది. థియేటర్లలోకి తొందరపడి తీసుకురావడం కంటే అత్యుత్తమ నాణ్యతతో అందించాలనే ఆలోచనతోనే ఈ ఒకరోజు వాయిదా నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ‘సింగ్ గీతం’కు క్లీన్ ‘యూ’ సర్టిఫికేట్ లభించింది. అందరూ ఫ్యామిలీతో కలిసి బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించదగిన అద్భుతమైన అనుభూతిని అందించేందుకు జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయాన్, అహల్యా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషిస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో పాటలు, నేపథ్య సంగీతం మెయిన్ హైలైట్స్ గా నిలవనున్నాయి. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చి సినిమాపై అంచనాలు పెంచాయి. విభిన్నమైన కాన్సెప్ట్, సింగీతం శ్రీనివాసరావు మార్క్ సృజనాత్మకత, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం కలిసి ‘సింగ్ గీతం’ ను ఈ ఏడాది అత్యంత ప్రత్యేకమైన చిత్రాలలో ఒకటిగా నిలబెడుతున్నాయి.

## దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380